

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV — STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 51 | ఎడిటర్ : బరిగెల శివ | బుధవారం 21, జనవరి 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాజ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్


# గ్రామాల భవిష్యత్తు.. ఎవరి చేతుల్లో ?






- రెండేళ్ల ఆలస్యం తర్వాత.. 227 కోట్ల నిధుల విడుదల
- వివాదం మూలం.. మూడు వర్గాల దావాలు
- మాజీ సర్పంచులు, ప్రత్యేక అధికారులు, కొత్త సర్పంచుల దృక్కోణాలు
- మాజీ సర్పంచుల బాధ అప్పుల భారం, వడ్డీలు, ఆత్మహత్యలు
- ప్రత్యేక అధికారుల శ్రమ జేబు డబ్బులతో పాలన
- కొత్త సర్పంచుల ఆశలు హామీలు, కొత్త పనులు
- మూల సమస్య సకాలంలో నిధులు ఎందుకు రావడం లేదు?
- అప్పుల పుట్టలుగా మారిన పంచాయతీలు
- గ్రామ స్వయంపాలన కాగితంపైనేనా?
- జై భీమ్ సంస్థల చైర్మన్ డాక్టర్ బరిగెల


**పంచాయతీల నిధులు.. ఎవరికి హక్కు?**



**హైదరాబాద్, జై భీమ్ డెస్క్**

రెండేళ్లుగా గ్రామ పంచాయతీలు నిధుల కోసం ఎదురుచూస్తున్నాయి. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం 227 కోట్ల రూపాయల నిధులను విడుదల చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మొత్తం ఒకటి రెండు రోజుల్లో గ్రామ పంచాయతీ ఖాతాల్లో జమ కానుంది. కానీ ఈ నిధులు ఎవరికి చెందుతాయని జై భీమ్ సంస్థల చైర్మన్ డాక్టర్ బరిగెల శివ అన్నారు.. ఒకవైపు మాజీ సర్పంచులు వారు తమ హయాంలో అభివృద్ధి పనుల కోసం అప్పులు చేసి, రోడ్లు, డ్రెయినేజీ, శ్మశానవాటికలు, పార్కులు, రైతు వేదికలు వంటివి చేపట్టారు. సుమారు 500 కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. వడ్డీలు పెరిగి ఆర్థిక ఇబ్బందులు తీవ్రమయ్యాయి. కొందరు మనస్తాపానికి గురై ఆత్మహత్యలకు పాల్పడ్డారనే వార్తలు వచ్చాయి. వారి వాదన సరళంగా ఉంది "మేం చేసిన పనులకు ఈ నిధులు మాకే ఇవ్వాలి. మరోవైపు ప్రత్యేక అధికారులు (స్పెషల్ ఆఫీసర్లు) పంచాయతీల గడువు ముగిసిన తర్వాత వీరిని నియమించారు. ఎన్నికలు జరగకపోవడంతో రెండేళ్ల పాటు పాలన భారం మోశారు. జీపీల కార్యదర్శులు తమ జేబుల నుంచి డబ్బులు వేసి పారిశుధ్యం, డీజిల్, ట్రాక్టర్ ఈఎంఐలు, జీతాలు కూడా సర్దుబాటు చేశారు. వీరి దృష్టిలో "మేం మోసిన భారానికి


- మిగతా 2లో..




## హైదరాబాద్ నిమ్స్‌లో స్టెమ్ సెల్ ల్యాబ్ ప్రారంభం

నిమ్స్‌లో స్టెమ్ సెల్ ల్యాబ్‌ను ప్రారంభించిన మంత్రి దామోదర రాజనర్సింహ

మందులతో నయం కాని మొండి వ్యాధులను నయం చేసే సామర్థ్యం స్టెమ్ సెల్ థెరపీకి ఉందని వెల్లడి



6

## పన్ను ఎగవేతకు చెక్.. గూడ్స్ వాహనాలపై తెలంగాణ సర్కార్ కొత్త రూల్

- గూడ్స్ వాహనాలకు జీవితకాల పన్ను విధానంపై తెలంగాణ ప్రభుత్వం కసరత్తు
- త్రైమాసిక పన్ను చెల్లింపు విధానానికి స్వస్తి పలకాలని నిర్ణయం
- పన్ను ఎగవేతను అరికట్టేందుకే ఈ కొత్త విధానమంటున్న ప్రభుత్వం
- కొత్తగా కొనుగోలు చేసే వాహనాలకు మాత్రమే ఈ నిబంధన వర్తింపు



6

## 'మన శంకర వరప్రసాద్ గారు' టిక్కెట్ ధరల పెంపు

5

## హరీశ్ రావు విచారణ..

- జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ ఎదుట ఉద్రిక్తత
- జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు ర్యాలీగా బయలుదేరిన వెళ్లిన ఎమ్మెల్యేలు
- పోలీసులకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ శ్రేణుల నినాదాలు
- పోలీసులు, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య స్వల్ప తోపులాట



2



## దుర్గం చెరువును వారు పట్టించుకోవడం లేదు

హైడ్రా కమిషనర్ రంగనాథ్

- దుర్గం చెరువును పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్
- దుర్గం చెరువులో పెరిగిన గుర్రపుడెక్క
- బాధ్యతను హైడ్రా తీసుకుంటుందన్న రంగనాథ్

6

## మెరుగైన శిక్షణతో విధుల్లో మరింత రాణించగలం వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్



**వరంగల్, 20 జనవరి 2026 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**

పోలీస్ అధికారులు, సిబ్బంది నిరంతరంగా నాణ్యమైన శిక్షణ పొందినప్పుడే అప్పగించిన విధుల్లో మరింత సమర్థవంతంగా, బాధ్యతాయుతంగా రాణించగలరని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానం, వృత్తి నైపుణ్యాలు పెంపొందితే ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే కాకుండా, విధుల నిర్వహణలో ఖచ్చితత్వం, వేగం పెరుగుతాయని ఆయన అన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న శివకుమార్, హైదరాబాద్ యూసుఫ్‌గూడలో నిర్వహించిన ఆరు నెలల ఆయుధ మరమ్మత్తుల ప్రత్యేక శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా, శిక్షణా కేంద్రం జారీ చేసిన దృవీకరణ పత్రాన్ని పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా శిక్షణా కాలంలో ఆయుధాల నిర్వహణ, మరమ్మత్తులు, భద్రతా ప్రమాణాలు, సాంకేతిక అంశాలపై పొందిన అనుభవాల గురించి కానిస్టేబుల్ శివకుమార్‌ను అడిగి పోలీస్ కమిషనర్ వివరాలు తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, ఆధునిక పోలీసింగ్‌లో ఆయుధాల సమర్థ వినియోగం, సంరక్షణ, మరమ్మత్తులపై సిబ్బందికి లోతైన అవగాహన ఉండటం అత్యంత అవసరమని తెలిపారు. ఇటువంటి ప్రత్యేక శిక్షణల వల్ల శాఖలో నైపుణ్యం కలిగిన సిబ్బంది సంఖ్య పెరుగుతుందని, ఇది భద్రతా పరంగా కూడా ఎంతో ప్రయోజనకరమని పేర్కొన్నారు. భవిష్యత్తులో పోలీస్ శాఖ అవసరాలను దృష్టిలో ఉంచుకుని, సిబ్బందిలో ప్రతిభ, ఆసక్తి ఉన్న వారిని గుర్తించి వివిధ ప్రత్యేక శిక్షణా కోర్సులకు పంపించాలని అధికారులను ఆయన ఆదేశించారు. తద్వారా మొత్తం పోలీస్ వ్యవస్థ మరింత బలపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో అదనపు డిప్యూటీ పోలీస్ కమిషనర్లు రవి, సురేష్‌కుమార్, శ్రీనివాస్, స్పర్జన్‌రాజ్ తదితరులు పాల్గొని, శిక్షణ పూర్తిచేసుకున్న కానిస్టేబుల్ శివకుమార్‌ను అభినందించారు. పోలీస్ శాఖలో సిబ్బంది నైపుణ్యాభివృద్ధికి ఇటువంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని వారు ఆకాంక్షించారు.

## హరీశ్ రావు విచారణ..

**జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ ఎదుట ఉద్రిక్తత**
**జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు ర్యాలీగా బయలుదేరిన వెళ్లిన ఎమ్మెల్యేలు**
**పోలీసులకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ శ్రేణుల నినాదాలు**
**పోలీసులు, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య స్వల్ప తోపులాట**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు సిట్ విచారణ నేపథ్యంలో జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ ఎదుట సాయంత్రం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో హరీశ్ రావుకు నోటీసులు జారీ చేయడం కక్షపూరిత చర్య అని, రానున్న మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అధికార పార్టీ కావాలనే విచారణ పేరుతో వేధిస్తోందని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రశాంత్ రెడ్డి, కౌశిక్ రెడ్డి, సంజయ్‌లు తెలంగాణ భవన్ నుంచి జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లారు. అక్కడ పోలీసులకు వ్యతిరేకంగా, హరీశ్ రావుకు అనుకూలంగా బీఆర్ఎస్ శ్రేణులు నినాదాలు చేశారు. ఈ క్రమంలో పోలీసులు, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య స్వల్ప తోపులాట చోటు చేసుకుంది. పోలీసులు బీఆర్ఎస్ కార్యకర్తలను చెదరగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. మరోవైపు, హరీశ్ రావు విచారణ ముగియనున్న నేపథ్యంలో బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున అక్కడికి తరలి వస్తున్నారు.

## అది సిట్ కాదు.. పిచ్చి విచారణ: కేటీఆర్

**హరీశ్ రావు సిట్ విచారణపై కేటీఆర్ ఆగ్రహం**
**అది సిట్ విచారణ కాదు, పిచ్చి విచారణ అని వ్యాఖ్య**
**సింగరేణి టెండర్ల స్కాంలో సీఎం బావమరిది సూత్రధారి అని ఆరోపణ**
**సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్**



**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తెలంగాణలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ మంత్రి హరీశ్ రావును సిట్ విచారించడాన్ని ఆయన తప్పుబట్టారు. ఇది సిట్ విచారణ కాదని, పిచ్చి విచారణ అని తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ వ్యాఖ్యానించారు. న్యాయం కోసం హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకైనా వెళతామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందని కేటీఆర్ విమర్శించారు. ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేక, ప్రశ్నించిన వారిపై కేసులు పెడుతోందని ఆరోపించారు. సింగరేణి టెండర్ల కుంభకోణంలో అసలు సూత్రధారి ముఖ్యమంత్రి బావమరిది సృజన్ రెడ్డేనని సంచలన ఆరోపణలు చేశారు. ఈ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.

# గ్రామాల భవిష్యత్తు ఎవరి చేతుల్లో?

మొదటి పేజీ తరువాయి

ఈ నిధులు మాకు దక్కాలి. ఇక కొత్తగా ఎన్నికైన సర్పంచులు తాము ఎన్నికల్లో హామీలిచ్చామని, గ్రామాల్లో కొత్త అభివృద్ధి పనులకు ఈ డబ్బు వినియోగించాలని ఆశిస్తున్నారు. "ప్రజలు మమ్మల్ని ఎన్నుకున్నారు కదా, మా హయాంలోనే పనులు చేయాలి" అంటున్నారు. ఈ మధ్యలో మూల సమస్య మరచిపోకూడదు అసలు గ్రామాలకు రావాల్సిన నిధులు ఎంత? ఎప్పుడు రావాలి? ఎందుకు ఆలస్యమవుతున్నాయి? గత ప్రభుత్వ హయాంలో ఎన్నికలు సకాలంలో జరగకపోవడం, కేంద్రం 15వ ఆర్థిక సంఘం నిధులను నిలిపివేయడం వంటి కారణాలతో ఈ సమస్య తీవ్రమైంది. ప్రభుత్వాలు అరకొరగా విడుదల చేస్తున్నాయి. దీంతో పంచాయతీలు అప్పుల పుట్టలుగా మారాయి. ప్రజల పన్నులు, సర్పంచుల అప్పులు, కార్మికుల శ్రమ మీదనే నడుస్తున్నాయి. చివరికి ఈ వివాదం సర్పంచులది మాత్రమే కాదు మొత్తం గ్రామ ప్రజలది. తాగునీరు, పారిశుధ్యం, రోడ్లు, వీధి దీపాలు వంటి కనీస అవసరాలు ఎప్పుడూ పెండింగ్‌లోనే ఉండకూడదు. ప్రభుత్వాలు సకాలంలో నిధులు విడుదల చేసి, చేసిన పనుల బిల్లులు చెల్లించి, పంచాయతీలను బలోపేతం చేయాలి. లేకపోతే గ్రామ స్వయంపాలన అనేది కేవలం కాగితంపైనే మిగిలిపోతుంది. అందరూ కలిసి ఈ సమస్యను పరిష్కరించాలి ఎవరికీ అన్యాయం కాకుండా, గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలి.




## తెలుగుదేశం పార్టీ వారికి రేవంత్ రెడ్డి అలా చెప్పడం రౌడీ మాదిరిగా పిలుపునివ్వడమే!: దాసోజు శ్రవణ్

**రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు రెండు పార్టీల మధ్య వైషమ్యాలకు దారితీస్తున్నాయని ఆగ్రహం**
**కేసీఆర్‌ను 100 మీటర్ల లోతున బొంద పెడతానంటే కేసు పెట్టవద్దా అని ప్రశ్న**
**రాహుల్ గాంధీ పుణ్యమా అని రేవంత్ రెడ్డి తెలంగాణ పాలిట శాపంగా మారాడని ఆగ్రహం**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**




బీఆర్ఎస్ దిమ్మెలను కూల్చివేయాలంటూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు పిలుపునివ్వడం రెండు పార్టీల మధ్య వైషమ్యాలకు దారితీస్తోందని బీఆర్ఎస్ సీనియర్ నేత దాసోజు శ్రవణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి ఖమ్మం జిల్లాలో చేసిన వ్యాఖ్యలపై ఆయన అడిషనల్ డీజీపీ మహేశ్ భగవత్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారని అన్నారు. రేవంత్ రెడ్డిపై కఠినమైన సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలని పోలీసులను కోరినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యలు రెండు పార్టీల మధ్య గొడవలకు, వైషమ్యాలకు దారి తీస్తాయని అన్నారు. ముక్కలు అవుతారని అన్నందుకే తలసాని శ్రీనివాస్ యాదవ్‌పై కేసు పెట్టారని, మరి కేసీఆర్‌ను, బీఆర్ఎస్‌ను బొంద పెట్టాలన్న రేవంత్ రెడ్డిపై కేసు పెట్టకూడదా అని ప్రశ్నించారు. నిన్న ఖమ్మం జిల్లాలో జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా మాట్లాడారని మండిపడ్డారు. నిరంతర పోరాటంతో తెలంగాణ సాధించిన కేసీఆర్‌ను, తెలంగాణ సాధన కోసమే పుట్టిన బీఆర్ఎస్ ను 100 మీటర్ల లోతున బొంద పెట్టాలని పిలుపునివ్వడం విడ్డూరమని అన్నారు. తెలంగాణకు ద్రోహం చేసిన, 1,200 మంది ఉద్యమకారులను బలితీసుకున్న తెలుగుదేశం పార్టీ ఇక్కడ బతికి బట్టకట్టాలని ఆయన కోరుకుంటున్నారని విమర్శించారు. తెలంగాణ కోసం పుట్టిన బీఆర్ఎస్, కేసీఆర్ ఉండకూడదా అని నిలదీశారు. రేవంత్ రెడ్డి మాట్లాడింది మనుషులు మాట్లాడే భాషనా, రాక్షసుల భాషనా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాజంలో అశాంతి రెచ్చగొట్టేలా మాట్లాడిన రేవంత్ రెడ్డిపై సుమోటోగా కేసు పెట్టాలని కోరామని అన్నారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై తెలంగాణ సమాజం ఆలోచన చేయాలని అన్నారు. "బీఆర్ఎస్ పార్టీ దిమ్మెలను తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు కలిసి తొలగించాలని ఒక రౌడీ మాదిరిగా పిలుపునిచ్చారు. అలా పిలుపునివ్వడం ద్వారా బీఆర్ఎస్, టీడీపీల మధ్య, ఇరు పార్టీల కార్యకర్తల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టే విధంగా, హింసాయుత వాతావరణం ప్రేరేపించేలా కలుషితమైన తెలంగాణ సమాజాన్ని తయారు చేయడం కోసం ఆయన మాట్లాడిన మాటలు దారుణం. కంచె చేను మేసినట్లుగా ఆయన అలా మాట్లాడటం దుర్మార్గం, శోచనీయం. ఒక ముఖ్యమంత్రి ముఠా నాయకుడిలా మాట్లాడటం భారతదేశంలో ఎవరూ మాట్లాడి ఉండకపోవచ్చు. కానీ రాహుల్ గాంధీ పుణ్యమా అని తెలంగాణ పాలిట శాపంగా రేవంత్ రెడ్డి మారారు. తన నోటికి అడ్డూ అదుపు లేకుండా మాట్లాడుతున్నారు" అని తీవ్రంగా విమర్శించారు.

## మూడు నెలల ముందే మార్కెట్లోకి మామిడి.. ధర మాత్రం అదుర్స్!

**హైదరాబాద్ మార్కెట్లలోకి ముందుగానే వచ్చిన మామిడి పళ్లు**
**సాధారణ సీజన్‌కు మూడు నెలల ముందే విక్రయాలు**
**బంగినపల్లి కిలో ధర రూ. 200 నుంచి రూ. 300**
**ధర ఎక్కువ ఉన్నా రుచి అంతంతమాత్రమేనంటున్న వినియోగదారులు**
**సాగు విధానాల్లో మార్పులే కారణమంటున్న వ్యాపారులు**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

మామిడి పళ్ల సీజన్ రావడానికి ఇంకా మూడు నెలల సమయం ఉన్నప్పటికీ, హైదరాబాద్ మార్కెట్లు అప్పుడే మామిడి పళ్లతో కళకళలాడుతున్నాయి. పండ్లలో రారాజు రాక వినియోగదారులకు సంతోషాన్నిస్తున్నా, వాటి ధరలు, రుచి మాత్రం నిరాశపరుస్తున్నాయి. నగరంలోని ఎర్రగడ్డ, మెహిదీపట్నం, ఎంజే మార్కెట్ వంటి ప్రధాన మార్కెట్లలో బంగినపల్లి, బెనిషాన్ రకం మామిడి పళ్లు దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం నాణ్యతను బట్టి కిలో బంగినపల్లి మామిడి ధర రూ. 200 నుంచి రూ. 300 వరకు పలుకుతోంది. సాధారణంగా సీజన్‌లో కిలో రూ. 50 నుంచి రూ. 60కే లభించే మామిడిని ఇప్పుడు ఇంత ఎక్కువ ధరకు కొనడానికి ప్రజలు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ధర అధికంగా ఉండటమే కాకుండా, ఈ పళ్లలో పులుపుదనం ఎక్కువగా ఉండి, ఆశించినంత రుచి లేదని కొనుగోలుదారులు చెబుతున్నారు. హైబ్రిడ్ సాగు పద్ధతులు, వాతావరణ మార్పులు, అకాల వర్షాల కారణంగానే పంట త్వరగా చేతికి వస్తోందని వ్యాపారులు వివరిస్తున్నారు. "ఇప్పుడు పళ్లకు సీజన్ అంటూ ఏముంటుంది చెప్పండి? అన్ని సీజన్‌లలోనూ అన్ని పళ్లూ కనబడుతున్నాయి, మామిడి కూడా అంతే," అని ఎర్రగడ్డ రైతు బజార్‌కు చెందిన సలీం అనే వ్యాపారి వ్యాఖ్యానించారు. గత మూడేళ్లుగా సంక్రాంతి సమయానికే మామిడి పళ్లు మార్కెట్‌కు వస్తున్నాయని మరో వ్యాపారి తెలిపారు. మొత్తంమీద, సీజన్‌కు ముందే మామిడి పళ్లు అందుబాటులోకి వచ్చినా, అధిక ధరలు, రుచి లేకపోవడం వల్ల అమ్మకాలు ఆశించిన స్థాయిలో జరగడం లేదని స్పష్టమవుతోంది.



## పి.డి.ఎస్.యు తెలంగాణ రాష్ట్ర 23వ మహాసభలను జయప్రదం చేయాలి

**విద్యార్థులకు పిలుపునిచ్చిన కాకతీయ యూనివర్సిటీ ప్రధాన కార్యదర్శి కావ్య**

**హన్మకొండ, 20 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

జనవరి 23, 24, 25 తేదీలలో ఖమ్మం జిల్లా కేంద్రంలో జరగనున్న పి.డి.ఎస్.యు తెలంగాణ రాష్ట్ర 23వ మహాసభలను జయప్రదం చేయాలని పి.డి.ఎస్.యు కాకతీయ యూనివర్సిటీ ప్రధాన కార్యదర్శి కావ్య విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు హనుమకొండలోని కాకతీయ యూనివర్సిటీ ఫస్ట్ గేట్ వద్ద పి.డి.ఎస్.యు తెలంగాణ రాష్ట్ర 23వ మహాసభల వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా కావ్య మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో పాలకవర్గాలు విద్యార్థులకు విద్యను దూరం చేసే విధానాలు అవలంబిస్తున్నాయని ఆరోపించారు. దేశంలో, రాష్ట్రంలో సమానత్వం లేని విద్యా వ్యవస్థ కొనసాగుతోందని, ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌలిక వసతులు కల్పించకపోవడం వల్ల సామాన్య విద్యార్థులు విద్యను అందుకోలేని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టులను భర్తీ చేయకపోవడం, విద్యారంగ అభివృద్ధికి సరిపడా నిధులు కేటాయించకపోవడం ద్వారా విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ఫీజు



రీయింబర్స్‌మెంట్ విడుదల కాకపోవడంతో అనేక మంది విద్యార్థులు పై చదువులు కొనసాగించలేని పరిస్థితి ఉందని, రీయింబర్స్‌మెంట్ బకాయిల కారణంగా ఎన్నో కళాశాలలు మూతపడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పి.డి.ఎస్.యు ఏర్పడిన దశాబ్దాల కాలం నుంచి విద్యార్థి సమస్యలపై అనేక ఉద్యమాలు నిర్వహించిందని, విద్యార్థి సంఘ నాయకులపై ఎన్ని బూటకపు కేసులు పెట్టినప్పటికీ విద్యార్థుల హక్కుల కోసం పి.డి.ఎస్.యు పోరాటం కొనసాగించిందని కావ్య తెలిపారు. ఈ పోరాటంలో జార్జిరెడ్డి, జంపాల చంద్రశేఖర్ ప్రసాద్, శ్రీపాద శ్రీహరి, రంగవల్లి, కోలా శంకర్ వంటి విద్యార్థి నాయకులు ఆదర్శంగా నిలిచారని గుర్తు చేశారు. ఈ వీరులను స్మరించుకుంటూ భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకునేందుకు ఖమ్మం జిల్లా కేంద్రంలో జరగనున్న తెలంగాణ రాష్ట్ర 23వ మహాసభల్లో విద్యార్థులు, మేధావులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ సహాయ కార్యదర్శి గణేష్, కోళ్ళ సంగీతతో పాటు యూనివర్సిటీ నాయకులు అనిల్, కీర్తి, సౌజన్య, సాధన, శ్రీజ, చెందిన, వాణి, రాహుల్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మేడారం మహాజాతరకు తుది మెరుగులు






**భక్తుల భద్రత, సౌకర్యాలపై కలెక్టర్ దివాకర టి.ఎస్. ప్రత్యేక ఆదేశాలు**

**మేడారం, 20 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**

మేడారం మహాజాతరకు ఇంకా వారం రోజుల సమయం మాత్రమే మిగిలి ఉండటంతో, తుది దశకు చేరుకున్న అన్ని పనులను నిర్ణీత గడువులో పూర్తిచేసి అవసరమైన మెరుగులు దిద్దాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎస్.ఎస్. తాడ్వాయి మండలంలోని మేడారం హరిత హోటల్‌లో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఐటిడిఏ పీఓ చిత్ర మిశ్రాతో కలిసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూభక్తులు ఎక్కువగా ఇబ్బందులు పడే అంశాలైన తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాల నిర్వహణ మరింత మెరుగ్గా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భక్తుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఇందుకోసం జంపన్న వాగు వద్ద షిఫ్టుల వారీగా గజ ఈతగాళ్లను నిరంతరం సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. అలాగే అగ్ని ప్రమాదాలు జరగకుండా జాతర ప్రాంతంలోని కీలక ప్రాంతాల్లో ఫైర్ ఇంజిన్లను మోహరించాలని తెలిపారు. భక్తుల ఆరోగ్య పరిరక్షణ దృష్ట్యా, టీటీడీ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన 50 పడకల ఆసుపత్రిలో నిపుణులైన వైద్యులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్ సూచించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాతరను సమర్థవంతంగా నిర్వహించినప్పుడే మహాజాతర నిజంగా విజయవంతమవుతుందని పేర్కొంటూ, ఇందుకోసం అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. అంతకుముందు ఈ నెల 18న మేడారంలో నిర్వహించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్యక్రమాన్ని ఎలాంటి అంతరాయాలు లేకుండా విజయవంతంగా నిర్వహించినందుకు జిల్లా అధికారులను కలెక్టర్ అభినందించారు. రాష్ట్ర చరిత్రలో హైదరాబాద్ వెలుపల నిర్వహించిన కేబినెట్ సమావేశాన్ని కూడా సమర్థవంతంగా నిర్వహించడంలో జిల్లా యంత్రాంగం కీలక పాత్ర పోషించిందని ఆయన పేర్కొన్నారు. మారుమూల అటవీ ప్రాంతమైన మేడారంలో ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సజావుగా నిర్వహించినందుకు అధికారులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఇది జిల్లా యంత్రాంగం సమన్వయం, అంకితభావానికి నిదర్శనమని ఆయన అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్ రావు, ఆర్డీఓ వెంకటేష్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కాజీపేటలో డ్రంక్ అండ్ డ్రైవ్‌పై కఠిన చర్యలు ముగ్గురికి రెండు రోజుల జైలు శిక్ష

**కాజీపేట, 20 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

వరంగల్ నగరంలో డ్రంక్ అండ్ డ్రైవ్ ఘటనలను నియంత్రించేందుకు పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. గౌరవ సన్ ప్రీత్ సింగ్, ఐపీఎస్, వరంగల్ పోలీస్ కమీషనర్ గారి ఆదేశాల మేరకు, రాయల ప్రభాకర్ రావు, అడిషనల్ డీసీపీ (ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్) సూచనలతో, టి. సత్యనారాయణ, ఏసీపీ వరంగల్ ట్రాఫిక్ పర్యవేక్షణలో కాజిపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు మొత్తం 19 మంది పట్టుబడ్డారు. వీరిలో ముగ్గురు వ్యక్తులు మోతాదుకు మించి మద్యం సేవించినట్లు నిర్ధారణ కావడంతో, వారిని గౌరవ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. కేసును విచారించిన గౌరవ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎస్. ఫాతిమా చిన్నప్ప గారు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు తీవ్రతను పరిగణనలోకి తీసుకుని అరుకల రాంమోహన్ రావు, పింటూ సింగ్, కత నిరంజన్ లకు రెండు రోజుల జైలు శిక్ష విధించారు. అనంతరం వారిని హుజురాబాద్ సబ్ జైలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ వంటి నేరాల వల్ల రోడ్డు ప్రమాదాలు పెరిగే ప్రమాదం ఉన్నందున, ప్రజల ప్రాణాల రక్షణే లక్ష్యంగా ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగిస్తామని పోలీసులు స్పష్టం చేశారు. ఈ ప్రత్యేక తనిఖీలను కాజిపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సీఐ పి. వెంకన్న పర్యవేక్షించారు.

## యూరియా కొరత, బోనస్, పరిహారం చెల్లించాలి

**హన్మకొండలో ఎఐకేఎఫ్ వినతిపత్రం**



**హన్మకొండ, జనవరి 20 (జై భీమ్ న్యూస్)**

రైతు సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ఆల్ ఇండియా కిసాన్ ఫెడరేషన్ (ఎఐకేఎఫ్) ఆధ్వర్యంలో హన్మకొండ జిల్లాలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఎఐకేఎఫ్ తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం ఎఐకేఎఫ్ హన్మకొండ జిల్లా కమిటీ నాయకులు జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో సూపర్డెంట్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎఐకేఎఫ్ జిల్లా కార్యదర్శి ఎన్. రెడ్డి హంసారెడ్డి మాట్లాడుతూ రైతులకు సరిపడా యూరియా అందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న ఆన్‌లైన్ యూరియా బుకింగ్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో క్షేత్రస్థాయిలో భూసార పరీక్షలు నిర్వహించి రైతులకు తగిన వ్యవసాయ సూచనలు ఇవ్వాలని కోరారు. పంటలు పండించిన రైతులకు క్వింటాలుకు రూ.500 బోనస్‌ను వెంటనే వారి ఖాతాల్లో జమ చేయాలని, గత సంవత్సరం అధిక వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ప్రకటించిన ఎకరాకు రూ.10 వేల పరిహారాన్ని తక్షణమే అందజేయాలని డిమాండ్ చేశారు. విత్తన వ్యాపారులు, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఉన్న నూతన విత్తన చట్టాన్ని సవరించి, రైతులకు నష్టం కలిగించే నిబంధనలను అమలు చేయవద్దని స్పష్టం చేశారు. యాసంగి సీజన్‌లో రైతులు వరి, మొక్కజొన్న, మిర్చి, కూరగాయల పంటలు సాగు చేస్తున్న నేపథ్యంలో యూరియా అత్యవసరంగా అవసరమైందని, అయితే సరఫరా లోపంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎఐకేఎఫ్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు వి. కిషన్, జిల్లా కమిటీ సభ్యులు దామరకొండ రమేష్, వెంకటేశ్వర్లు, చీపురు ఓదయ్య, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

## కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల ప్రత్యేకాధికారులకు ఐదు రోజుల శిక్షణా కార్యక్రమం



**హన్మకొండ, 20 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

సమగ్ర శిక్షా కార్యక్రమంలో భాగంగా కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో పనిచేస్తున్న ప్రత్యేకాధికారులు, కేర్‌టేకర్ల సాధికారత, సామర్థ్యాల బలోపేతం లక్ష్యంగా ఐదు రోజుల ప్రత్యేక శిక్షణా కార్యక్రమం హనుమకొండ జిల్లా నక్కలగుట్టలోని హోటల్ హరిత కాకతీయలో ప్రారంభమైంది. ఈ శిక్షణా కార్యక్రమం జనవరి 19 నుంచి 23వ తేదీ వరకు కొనసాగనుంది. ఈ కార్యక్రమాన్ని స్కూల్ ఎడ్యుకేషన్, లిటరసీ విభాగం ఆధ్వర్యంలో, ఎన్ఐఈపిఎ సహకారంతో నిర్వహిస్తున్నారు. ఇందులో కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల ప్రత్యేకాధికారులతో పాటు మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న కేర్‌టేకర్లు పాల్గొంటున్నారు. మొదటి రోజు శిక్షణా కార్యక్రమాన్ని వరంగల్ జిల్లా రెవెన్యూ అధికారి (డిఆర్ఓ) విజయలక్ష్మి జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ముఖ్య అతిథిగా న్యూఢిల్లీ నుండి మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ అండర్ సెక్రటరీ రామనివాస్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా విద్యాశాఖాధికారి రంగయ్యనాయుడు, వరంగల్ జెండర్ కోఆర్డినేటర్ ఫ్లోరెన్స్, హనుమకొండ జెండర్ కో ఆర్డినేటర్ సునిత, జనగామ జెండర్ కోఆర్డినేటర్ గౌసియం బేగం, కరీంనగర్ జెండర్ కో ఆర్డినేటర్ కృపారాణి, ఎఎంఓ సుజన్ తేజ, ప్లానింగ్ కోఆర్డినేటర్ విజయకుమార్, అసిస్టెంట్ స్టాటిస్టికల్ కోఆర్డినేటర్ వేణుగోపాల్, రాష్ట్ర అసిస్టెంట్ జెండర్ కోఆర్డినేటర్ సతీష్ పాల్గొన్నారు. మాస్టర్ ట్రైనర్లు కృష్ణవేణి, సరస్వతి, జ్యోతిలు శిక్షణా సెషన్లు నిర్వహించారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల బాలికలకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు పనిచేస్తున్నాయని వక్తలు తెలిపారు. ఈ విద్యాలయాల్లో పనిచేస్తున్న ప్రత్యేకాధికారుల వృత్తి నైపుణ్యాలు, సమస్యా పరిష్కార సామర్థ్యం, నాయకత్వ లక్షణాలను మరింత బలోపేతం చేయడానికే ఈ శిక్షణా కార్యక్రమాన్ని రూపొందించినట్లు పేర్కొన్నారు. ఈ ఐదు రోజుల శిక్షణలో హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లాలకు చెందిన ప్రత్యేకాధికారులు, కేర్‌టేకర్లతో కలిపి మొత్తం 41 మంది పాల్గొంటున్నారు. శిక్షణా కార్యక్రమం ద్వారా వారి వృత్తి నైపుణ్యాలు, సామర్థ్యాలు మెరుగుపడి బాలికల విద్యాభివృద్ధికి మరింత దోహదపడుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## బలవంతంగా ట్రాఫిక్ చలాన్లు వసూలు చేయవద్దు: హైకోర్టు కీలక ఆదేశాలు

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తెలంగాణ హైకోర్టు వాహనాల పెండింగ్ చలాన్‌లపై కీలక ఆదేశాలు జారీ చేసింది. పెండింగ్ చలాన్‌ల విషయంలో వాహనదారులను బలవంత పెట్టవద్దని ట్రాఫిక్ పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ట్రాఫిక్ పోలీసులు బలవంతంగా చలాన్‌లు వసూలు చేస్తున్నారని ఆరోపిస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌పై న్యాయవాది విజయ్ గోపాల్ వాదనలు వినిపించారు. పెండింగ్ చలాన్‌ల వసూలు కోసం ట్రాఫిక్ పోలీసులు వాహనదారులను ఇబ్బంది పెడుతున్నారని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో హైకోర్టు ట్రాఫిక్ పోలీసులకు ఈ ఆదేశాలు జారీ చేసింది. చలాన్‌లు చెల్లించాలని వాహనాల తాళాలు లాక్కోవడం, వాహనాన్ని ఆపడం వంటి చర్యలకు పాల్పడవద్దని ట్రాఫిక్ పోలీసులకు సూచించింది. వాహనం ఆపినప్పుడు వాహనదారు స్వచ్ఛందంగా చలాన్‌లు చెల్లిస్తే పోలీసులు వసూలు చేయవచ్చని పేర్కొంది. వాహనదారులు చలానా చెల్లించడానికి ఇష్టపడకుంటే చట్ట ప్రకారం వారికి నోటీసులు ఇవ్వాలని ఆదేశించింది.

## ఎల్కతుర్తిలో బాల కార్మికుడు పట్టుబడ్డాడు

**గ్రానైట్ కంపెనీ యజమానిపై కేసు**



**ఎల్కతుర్తి, జనవరి 20, 2026 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**

ఎల్కతుర్తి మండల కేంద్రంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయ సమీపంలో ఉన్న సాయి గణపతి స్టోన్ కంపెనీ యజమానిపై పోలీసులు కేసు నమోదు చేశారు. స్టోన్ కంపెనీలో బాల కార్మికులు పనిచేస్తున్నారన్న సమాచారంతో కాజిపేట సబ్ డివిజన్ అధికారుల ఆదేశాల మేరకు ఎస్సై గుగులోత్ రామ్మోహన్ ఆధ్వర్యంలో హనుమకొండ పోలీసు బృందం, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులతో కలిసి తనిఖీలు నిర్వహించింది. తనిఖీల్లో స్టోన్ కంపెనీలో పనిచేస్తున్న అస్సాం రాష్ట్రానికి చెందిన 15 ఏళ్ల లోపు బాలుడిని బాల కార్మికుడిగా గుర్తించారు. ఈ మేరకు కంపెనీ యజమానిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. బాలుడి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి, అనంతరం కుటుంబ సభ్యులతో పంపించినట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా, స్టోన్ కంపెనీ యజమానుల ఆగడాలు ఇంతింత కాదని కార్మికులు ఆరోపిస్తున్నారు. అధిక పనిభారం విధించడంతో పాటు, కనీస సౌకర్యాలు లేని ఇరుకు గదుల్లో, దోమలుఈగలతో నిండిన పరిస్థితుల్లో కార్మికులను నివసింపజేస్తూ శ్రమ దోపిడీకి పాల్పడుతున్నారని పలువురు కార్మికులు మీడియాకు వివరించారు. పనిభారం తట్టుకోలేక కొందరు కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలున్నాయన్న ఆరోపణలూ వినిపిస్తున్నాయి. ఈ ఘటనపై లోతైన విచారణ చేపట్టి, బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

## నన్ను కాపాడటానికి ఎవరూ లేరు: రేణు దేశాయ్

**తన తప్పు లేకపోయినా తనను విమర్శిస్తున్నారన్న రేణు**
**నేను నమ్మే భగవంతుడికే నా బాధ చెప్పుకుంటానని వ్యాఖ్య**
**వీధి కుక్కల విషయంలో తన పోరాటం కొనసాగుతుందన్న రేణు**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

వీధి కుక్కలను చంపడంపై గళమెత్తిన నటి రేణూ దేశాయ్? మరోసారి భావోద్వేగంగా స్పందించారు. తనను కాపాడటానికి ఎవరూ లేరంటూ సోషల్ మీడియాలో చేసిన పోస్ట్ ప్రస్తుతం వైరల్‌గా మారింది. ఈ అంశంపై తాను చేసిన వ్యాఖ్యలకు తీవ్ర విమర్శలు ఎదురవుతున్నాయని, అయినా వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని రేణు స్పష్టం చేశారు. కాశీలో గంగానదిలో బోటింగ్ చేస్తున్న వీడియోను షేర్ చేసిన ఆమె, "నన్ను కాపాడటానికి అమ్మానాన్న, అన్నయ్య, భర్త ఎవరూ లేరు. అయినా నా తప్పు లేకపోయినా ఎంతోమంది నన్ను విమర్శిస్తున్నారు. వాటికి తిరిగి సమాధానం చెప్పే ఉద్దేశం నాకు లేదు. నేను నమ్మే భగవంతుడికే నా బాధ చెప్పుకుంటాను. ఆయన నా ప్రార్థనలు వింటాడన్న విశ్వాసం ఉంది. నేను తరచూ కాశీకి ఎందుకు వస్తానో ఇప్పుడు అర్థమవుతుందేమో" అంటూ భావోద్వేగంగా రాసుకొచ్చారు. అలాగే వీధి కుక్కల విషయంలో తన పోరాటం కొనసాగుతుందని రేణూ మరోసారి స్పష్టం చేశారు. "నేను ఎప్పుడూ నా వ్యక్తిగత హక్కుల కోసం పోరాడలేదు. కానీ, కొన్ని కుక్కల తప్పు కారణంగా వందల సంఖ్యలో వాటిని చంపడం సరైన నిర్ణయం కాదు. ఈ విషయాన్ని సమాజం అర్థం చేసుకునే వరకూ నా పోరాటం ఆగదు" అని తేల్చిచెప్పారు. తాను ఒక రాజకీయ పార్టీలో చేరనున్నట్లు వచ్చిన వార్తలను కూడా ఆమె ఖండించారు. తనకు అలాంటి ఉద్దేశం ఏమాత్రం లేదని స్పష్టతనిస్తూ, ఇది పూర్తిగా జంతు హక్కుల కోసం చేస్తున్న పోరాటమేనని రేణూ దేశాయ్ పేర్కొన్నారు.

## జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ డా. సత్య శారద**






**వరంగల్, జనవరి 20 (జై భీమ్ న్యూస్)**

జిల్లాలో జనవరి 25న నిర్వహించనున్న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అధికారులు పరస్పర సమన్వయంతో వివిధ అవగాహన కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలల్లో ఓటు హక్కు ప్రాముఖ్యతపై వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేయాలని, సీనియర్ సిటిజన్లను గుర్తించి జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా సన్మానించాలని తెలిపారు. అలాగే ఫ్లాష్ మాబ్‌లు, మానవహారం, సాంస్కృతిక కళాజత బృందాల ద్వారా ఓటర్లలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్ఓ విజయలక్ష్మి, జెడ్పిసిఈఓ రాంరెడ్డి, ఆర్డీవోలు సుమ, ఉమారాణి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

జై భీమ్ POWER OF PEOPLE Jai Bheem

# మహిళా సంక్షేమ పథకాల పేరుతో మహిళా తిరోగమన విధానాలు


కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఏఐఎఫ్‌డబ్ల్యూ తీవ్ర విమర్శలు



**హన్మకొండ, 20 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

మహిళా సంక్షేమ పథకాల పేరుతో మహిళలపై తిరోగమన విధానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయని ఎ.ఐ.ఎఫ్.డి.డబ్ల్యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు కనకం సంధ్య తీవ్రంగా విమర్శించారు. సోమవారం హనుమకొండలోని ఏకశిల పార్క్‌లో అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య (ఎ.ఐ.ఎఫ్.డి.డబ్ల్యూ) హనుమకొండ జిల్లా కమిటీ సమావేశం మాస్ సావిత్రి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కనకం సంధ్య మాట్లాడుతూ, దేశంలో మహిళ రాష్ట్రపతి ఉన్నప్పటికీ మహిళల రక్షణ, ఉపాధి, ఉద్యోగాల విషయంలో ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. శాసనసభలు, పార్లమెంటులో మహిళలకు తగిన ప్రాతినిధ్యం లేకపోవడం వల్ల పురుషాధిక్యత పెరిగి, మహిళలపై లైంగిక దాడులు, అత్యాచారాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలపై అత్యాచారాలు, హత్యలకు పాల్పడిన నిందితులను రెడ్‌కార్పెట్ పరచి జైళ్ల నుంచి విడుదల చేస్తున్న తీరు అత్యంత ఖండనీయమని పేర్కొన్నారు. పైకి సంక్షేమ పథకాలు ప్రకటిస్తూ, ఆచరణలో మహిళల ఆత్మగౌరవంపై దాడులు జరుగుతున్నాయని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నోట్లో బెల్లం పెట్టి కంట్లో కారం చల్లుతున్నట్లుగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. బీహార్ శాసనసభ ఎన్నికల సందర్భంగా నేరుగా ఖాతాల్లో డబ్బులు జమ చేసి, అనంతరం దేశవ్యాప్తంగా అదనపు భారాలు మోపుతున్నారని తెలిపారు. వివిధ రంగాల్లో పనిచేస్తున్న మహిళలకు శ్రమకు తగిన వేతనాలు ఇవ్వడం లేదని, ప్రభుత్వ రంగాన్ని రద్దు చేసి ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించడం మహిళలకు నష్టంగా మారుతోందని అన్నారు. రాష్ట్రంలో ఉచిత బస్సు ప్రయాణ పథకం అన్ని ప్రాంతాల మహిళలకు అందడం లేదని, ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని, మహిళల రక్షణకు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశం అనంతరం హనుమకొండ జిల్లా కన్వీనింగ్ కమిటీని తొమ్మిది మందితో ఏర్పాటు చేశారు. జిల్లా కన్వీనర్‌గా మాస్ సావిత్రిని ఎన్నుకోగా, కమిటీ సభ్యులుగా అన్నబోయిన ప్రేమలత, సరమండ సౌజన్య, రాసలా రమ, మాలోతు దేవమ్మ, దామరకొండ కవిత, వక్కల లత, ఎండి అశ్రఫ్, బండారి మమత, రాధికలను ఎంపిక చేసినట్లు తెలిపారు.

## చిన్న విషయాలకే తీవ్రమైన నిర్ణయాలు మెదక్‌లో విషాదం



**మెదక్, 20 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**

మెదక్ జిల్లాలో చోటుచేసుకున్న హృదయవిదారక ఘటన సమాజాన్ని కలచివేసింది. మొబైల్ ఫోన్‌ను ఎక్కువగా వాడుతున్నావంటూ తల్లి చేసిన చిన్న మందలింపును మనసుకు తీసుకున్న ఓ యువతి తీవ్ర మనోవేదనకు లోనై ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన కుటుంబాలు, యువత మానసిక ఆరోగ్యంపై లోతైన చర్చకు దారితీస్తోంది. వివరాల ప్రకారం, మెదక్ జిల్లా ముత్తాయిపల్లి గ్రామానికి చెందిన 19 ఏళ్ల యువతి శిరీష ఇంట్లో ఉండగా మొబైల్ ఫోన్ వినియోగంపై తల్లి మందలించింది. సాధారణంగా జరిగే మాటల మార్పిడే అయినప్పటికీ, యువతి దానిని తీవ్రంగా అనుభవించింది. క్షణిక ఆవేశంలో ఇంట్లో ఉన్న ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు వెంటనే స్పందించి ఆమెను ఆస్పత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటన యువతలో పెరుగుతున్న మానసిక ఒత్తిడి, మొబైల్ ఫోన్‌పై అధిక ఆధారపడటం, కుటుంబ సభ్యుల మధ్య సరైన సంభాషణ లోపం వంటి అంశాలపై ఆందోళనను రేకెత్తిస్తోంది. చిన్న విషయాలకే తీవ్రమైన నిర్ణయాలు తీసుకునే పరిస్థితి ఏర్పడటం సమాజానికి హెచ్చరికగా మారిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇలాంటి విషాదాలు పునరావృతం కాకుండా తల్లిదండ్రులుపిల్లల మధ్య స్నేహపూర్వక సంభాషణ, భావోద్వేగాలకు విలువ ఇవ్వడం ఎంతో అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. కుటుంబ వాతావరణంలో పరస్పర అవగాహన పెరిగితేనే ఇలాంటి ఘటనలను నివారించగలమని వారు అభిప్రాయపడుతున్నారు.

## ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలి

జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

హసన్‌పర్తి ఈటీసీలో సర్పంచుల ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించిన కలెక్టర్





**హన్మకొండ, 20 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

పంచాయతీరాజ్ చట్టం ప్రకారం సర్పంచులు తమ విధులు, బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని స్నేహ శబారీష్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. గ్రామాల సమగ్ర అభివృద్ధి సర్పంచుల చొరవ, నాయకత్వంపై ఆధారపడి ఉంటుందని ఆమె స్పష్టం చేశారు. మంగళవారం హసన్‌పర్తి మండల కేంద్రంలో టిటిడిసిలో ఉన్న విస్తరణ శిక్షణ కేంద్రం (ఎక్స్‌టెన్షన్ ట్రైనింగ్ సెంటర్‌ఈటీసీ)లో నూతనంగా ఎన్నికైన సర్పంచులకు నిర్వహిస్తున్న ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ శిక్షణ కార్యక్రమం జనవరి 19 నుంచి 23వ తేదీ వరకు కొనసాగనుంది. జిల్లాలోని భీమదేవరపల్లి, కమలాపూర్, నడికూడ, ఆత్మకూరు, శాయంపేట మండలాలకు చెందిన మొత్తం 103 మంది సర్పంచులు ఈ శిక్షణలో పాల్గొంటున్నారు. గ్రామ పంచాయతీల నిర్వహణలో సర్పంచుల అధికారాలు, విధులు, బాధ్యతలు, పరిమితులు, ఆర్థిక నిర్వహణ, అభివృద్ధి పనుల అమలు, ప్రజలతో సమన్వయం వంటి అంశాలపై శిక్షణ అందిస్తున్నారు. శిక్షణ రెండో రోజు సందర్భంగా కలెక్టర్ సర్పంచులతో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకమని అన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ, త్రాగునీటి సరఫరా, వీధి దీపాలు, డ్రైనేజీ వ్యవస్థ, హరిత కార్యక్రమాలు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లో పారదర్శకతతో పాలన సాగించాలని అన్నారు. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం విధులు నిర్వహిస్తూ, నిబంధనలకు లోబడి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. గ్రామాలను స్వచ్ఛ తెలంగాణ దిశగా ముందుకు నడిపించేందుకు సర్పంచులు నాయకత్వం వహించాలని పిలుపునిచ్చారు. ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని, సర్పంచులు ప్రజలకు ఆదర్శంగా నిలవాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్, ఈటీసీ ప్రిన్సిపల్ కౌసల్య దేవి, డీఎల్పీవోలు రవిబాబు, గంగా భవాని, ఎంపీడీవోలు రామకృష్ణ, అనిల్ కుమార్, ఎంపీవోలు రంగా చారి, చేతన్ కుమార్, రంజిత్, యోగితా, మార్గవి, ఐఈసీ కోఆర్డినేటర్ సంపత్ కుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు. ర్పంచులు పెద్ద సంఖ్యలో హాజరై శిక్షణ కార్యక్రమాన్ని ఆసక్తిగా అనుసరించారు.

## ఇంటి వద్ద నుంచే ఫిర్యాదులు

బాధితులకే ప్రాధాన్యం ఇచ్చిన తెలంగాణ పోలీస్ సంస్కరణ




**హైద్రాబాద్, 20 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**

నేరాలకు గురైన బాధితులకు న్యాయం మరింత వేగంగా, సులభంగా అందించాలనే లక్ష్యంతో తెలంగాణ పోలీస్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై పోలీస్ స్టేషన్‌కు వెళ్లలేని పరిస్థితుల్లో ఉన్న బాధితులు తమ ఇంటి వద్ద నుంచే ఫిర్యాదులు చేసుకునే సౌకర్యాన్ని అమల్లోకి తీసుకురానున్నట్లు ఉన్నతాధికారులు వెల్లడించారు. వృద్ధులు, మహిళలు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు, దివ్యాంగులు, అలాగే అత్యవసర పరిస్థితుల్లో ఉన్న నేర బాధితులు పోలీస్ స్టేషన్‌కు రావడం కష్టమయ్యే సందర్భాల్లో సంబంధిత పోలీస్ అధికారులు నేరుగా వారి నివాసానికి వెళ్లి ఫిర్యాదును స్వీకరిస్తారు. ఫిర్యాదు నమోదు చేసిన వెంటనే చట్టపరమైన చర్యలు ప్రారంభించి, కేసు దర్యాప్తును వేగవంతం చేస్తామని అధికారులు స్పష్టం చేశారు. ఇప్పటి వరకు భయం, శారీరక అసౌకర్యం, సామాజిక ఒత్తిళ్ల కారణంగా అనేక నేరాలు బయటకు రాని పరిస్థితులు ఉన్నాయని పోలీస్ శాఖ గుర్తించింది. ఈ కొత్త విధానం ద్వారా ఫిర్యాదు చేయడంలో ఉన్న అడ్డంకులను తొలగించి, ప్రతి బాధితుడికి న్యాయం అందేలా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. దీని ద్వారా పోలీస్‌ప్రజల మధ్య నమ్మకం మరింత బలపడుతుందని అభిప్రాయపడ్డారు. ఇదిలా ఉండగా, సైబర్ నేరాల బాధితుల కోసం ఇప్పటికే అమలులో ఉన్న 'సీ-మిత్ర' సేవ కూడా మంచి ఫలితాలు ఇస్తోందని పోలీస్ శాఖ పేర్కొంది. ఆన్‌లైన్ మోసాలు, బ్యాంక్ ఫ్రాడ్, సోషల్ మీడియా ద్వారా జరిగే నేరాలకు గురైన వారు వెంటనే ఫిర్యాదు చేయడం వల్ల బ్యాంక్ లావాదేవీలను నిలిపివేయడం, నష్టాన్ని తగ్గించడం సాధ్యమవుతోందని వెల్లడించారు. అనేక కేసుల్లో బాధితుల డబ్బును రికవరీ చేయగలిగామని అధికారులు తెలిపారు. మొత్తంగా, ఇంటి వద్ద నుంచే ఫిర్యాదుల స్వీకరణతో పాటు సైబర్ నేరాలపై ప్రత్యేక సేవల అమలుతో తెలంగాణ పోలీస్ శాఖ ప్రజానుకూల పోలీసింగ్ దిశగా ముందడుగు వేసింది. ఈ సంస్కరణలతో నేరాలపై ఫిర్యాదులు పెరిగి, న్యాయం మరింత త్వరగా బాధితుల చెంతకు చేరుతుందన్న ఆశాభావం వ్యక్తమవుతోంది.

## మేడారం వనదేవతలను దర్శించుకున్న ఎర్రబెల్లి ఉషా దయాకర్ రావు

**మేడారం, 20 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**



తెలంగాణ మహా కుంభమేళాగా పేరుగాంచిన మేడారం సమ్మక్క సారలమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా మంగళవారం చిలుకలగట్టులోని శ్రీ సమ్మక్కసారలమ్మ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ ప్రత్యేక పూజల్లో ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ ఎర్రబెల్లి ఉషా దయాకర్ రావు బంధువులతో కలిసి పాల్గొని, మొక్కులను చెల్లించుకొని అమ్మవార్ల ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఉషమ్మ మాట్లాడుతూ, సమ్మక్కసారలమ్మల కృపతో రాష్ట్ర ప్రజలందరికీ ఆరోగ్యం, శాంతి, సుభిక్షం కలగాలని ప్రార్థించినట్లు తెలిపారు. జాతర వాతావరణం భక్తిశ్రద్ధలతో నిండిపోయి, భక్తుల జయజయధ్వానాలతో మేడారం అరణ్యం మార్మోగింది.

## అగ్రంపహాడ్ జాతర ప్రాధాన్యత పెంచేలా సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలి

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి

జాతర ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి : హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



**హన్మకొండ, 20 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

మినీ మేడారంగా పేరొందిన అగ్రంపహాడ్ శ్రీ సమ్మక్క సారలమ్మ జాతరను అత్యంత వైభవంగా, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలంలోని అగ్రంపహాడ్ జాతర ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్తో కలిసి వివిధ శాఖల అధికారులతో జాతర ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాదాయ, రెవెన్యూ, విద్యుత్, వైద్యఆరోగ్య, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, పోలీస్, ఎక్సైజ్, అగ్నిమాపక, సాగునీటిపారుదల, మత్స్య శాఖల ఆధ్వర్యంలో ఇప్పటివరకు చేపట్టిన అభివృద్ధి పనులు, ఏర్పాట్ల పురోగతిని ఎమ్మెల్యే, కలెక్టర్ పరిశీలించారు. లక్షలాది మంది భక్తులు జాతరకు తరలివచ్చే అవకాశం ఉన్నందున ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా హెల్ప్‌డెస్క్‌లు, కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి 24 గంటల పాటు పనిచేసే విధంగా సిబ్బందిని నియమించాలని సూచించారు. మహిళల సౌకర్యార్థం ప్రత్యేక డ్రెస్సింగ్ రూములు ఏర్పాటు చేయాలన్నారు. నిరంతర విద్యుత్ సరఫరా కోసం ఇప్పటికే విద్యుత్ శాఖ ద్వారా 160 కిలోవాట్ల సామర్థ్యంతో నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రధాన కూడళ్లలో, రోడ్ల ఇరువైపులా తగినంత విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ శాఖల ద్వారా చేపట్టిన అంతర్గత రోడ్ల పనులు పూర్తయ్యాయని, అవసరమైన చోట్ల రోడ్ల పక్కన ఉన్న ముళ్ల పొదలను తొలగించి డివైడర్లకు రంగులు వేయాలని సూచించారు. ఇరిగేషన్ శాఖ ద్వారా 15 స్నాన ఘట్టాలు ఏర్పాటు చేయడం జరిగిందని, కాలువల్లో ఉన్న చెత్తను తొలగించాలని అన్నారు. పార్కింగ్ స్థలాలు, బస్టాండ్, గద్దెల ప్రాంగణం వద్ద పూర్తిస్థాయిలో లైటింగ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణ కోసం 152 మంది పారిశుద్ధ్య కార్మికులను కేటాయించి 24 గంటల పాటు శానిటేషన్ చేపడుతున్నట్లు చెప్పారు. భక్తుల రద్దీని బట్టి మరింత మంది కార్మికులను నియమించేందుకు ఎంపీడీవోను ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖ ద్వారా ఐదు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి, వ్యాక్సిన్లు సహా అత్యవసర మందులు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఆత్మకూరులో ప్రత్యేకంగా 10 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. భద్రతా పరంగా పోలీస్ శాఖ ద్వారా కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, 150 సీసీ కెమెరాలతో నిరంతర నిఘా కొనసాగిస్తామని చెప్పారు. భక్తుల దర్శనానికి ఇబ్బంది కలగకుండా వీఐపీ వాహనాలను కూడా పార్కింగ్ స్థలాల్లోనే ఉంచేలా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు సూచించారు. జాతరకు ఆర్టీసీ ద్వారా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ, జాతర ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయని, ఇప్పటివరకు సమర్థవంతంగా పనులు పూర్తి చేసిన శాఖల అధికారులను అభినందించారు. జాతర ముగిసే వరకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాతరను విజయవంతం చేయాలని అధికారులను కోరారు. ఈ సమీక్ష సమావేశంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి నాగేశ్వరరావు, పరకాల ఆర్డీఓ డా. కన్నం నారాయణ, ఆర్ అండ్ బి ఈఈ సురేష్ బాబు, పరకాల ఏసీపీ సతీష్ బాబు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ ఈఈ ఆత్మారాం, సాగునీటిపారుదల శాఖ ఈఈ సునీత, ఆత్మకూర్ తహసీల్దార్ జగన్మోహన్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, అగ్రంపహాడ్, అక్కంపేట సర్పంచులు, సమ్మక్క సారలమ్మ పూజారులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్‌లో ట్రాఫిక్ ఉల్లంఘనలపై ఉక్కుపాదం

**'అరైవ్ అలైవ్' వేదికగా ఆటో డ్రైవర్లకు పోలీసుల కఠిన హెచ్చరిక**

**వరంగల్, 20 జనవరి 2026 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**

వరంగల్ నగర పరిధిలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనల నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు గట్టి చర్యలకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో వరంగల్‌లోని వెంకటేశ్వర గార్డెన్‌లో ఆటో డ్రైవర్లను లక్ష్యంగా చేసుకుని 'అరైవ్ అలైవ్' రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించే చర్యలను నేరాలుగా పరిగణించి ఇకపై కఠిన చర్యలు తప్పవని పోలీసులు స్పష్టమైన సందేశం ఇచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న ఉన్నతాధికారులు మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనం నడపడం, అధిక వేగంతో డ్రైవింగ్ చేయడం, రాంగ్ సైడ్ డ్రైవింగ్ వంటి చర్యలు కేవలం నిబంధనల ఉల్లంఘనలే కాకుండా ప్రాణాంతక నేరాలుగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి నిర్లక్ష్య చర్యల వల్ల అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా డీసీపీ ధార కవిత మాట్లాడుతూ, "ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలను చిన్న తప్పులుగా భావించకూడదు. మద్యం సేవించి వాహనం నడపడం, రాంగ్ సైడ్ డ్రైవింగ్, అధిక వేగం వంటి చర్యలు నేరాలే. ఇవి అమాయకుల ప్రాణాలు తీస్తున్నాయి. ఇకపై ఇలాంటి తప్పులకు కఠిన చర్యలు తప్పవు" అని స్పష్టం చేశారు. ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ మాట్లాడుతూ, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, లైసెన్స్ లేకుండా వాహనం నడపడం ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా



మారాయని పేర్కొన్నారు. ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలు పాటించాలని, ఉల్లంఘనలు కొనసాగితే కేసులు నమోదు చేసి అవసరమైతే లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. హనుమకొండ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సీతా రెడ్డి మాట్లాడుతూ, ఆటోలకు చట్టబద్ధమైన నెంబర్ ప్లేట్లు తప్పనిసరి అని, ఫ్యాన్సీ నెంబర్ ప్లేట్లు వాడటం చట్టవిరుద్ధమని తెలిపారు. విధి నిర్వహణలో ఉన్నప్పుడు యూనిఫాం ధరించాల్సిందేనని, ఆటోలో నిర్ణయించిన సంఖ్యకు మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం నేరమని స్పష్టం చేశారు. కాజీపేట ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ వెంకన్న మాట్లాడుతూ, రాంగ్ సైడ్ డ్రైవింగ్, ట్రాఫిక్ సిగ్నల్స్ ఉల్లంఘించడం వల్ల ప్రమాదాలు పెరుగుతున్నాయని చెప్పారు. ఇకపై అవగాహనతో పాటు కఠిన అమలు చర్యలు కూడా కొనసాగుతాయని తెలిపారు. వరంగల్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ కోదూరు సుజాత మాట్లాడుతూ, ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తిస్తూ భద్రంగా గమ్యస్థానాలకు చేర్చడం ఆటో డ్రైవర్ల ప్రధాన బాధ్యత అని అన్నారు. మద్యం సేవించి వాహనం నడపడం, అధిక వేగం, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, చట్టం ముందు ఎవరూ అతీతులు కాదని కఠినంగా హెచ్చరించారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఆటో డ్రైవర్లకు మద్యం సేవించి డ్రైవింగ్ చేయరాదు, సెల్‌ఫోన్ ఉపయోగించరాదు, చట్టబద్ధమైన నెంబర్ ప్లేట్లు, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి, రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేయరాదు, అధిక సంఖ్యలో ప్రయాణికులను ఎక్కించుకోరాదు వంటి పలు కీలక నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ క్రైమ్ అవగాహన కార్యక్రమంలో సుమారు 300 మంది ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు. ట్రాఫిక్ నిబంధనలను లెక్కచేయకుండా వ్యవహరిస్తే ప్రమాదాలే కాకుండా కఠిన చట్టపరమైన శిక్షలు తప్పవని పోలీసులు మరోసారి స్పష్టమైన హెచ్చరిక జారీ చేశారు.

# గిగ్ ఎకానమీ కార్మికుల గొంతుకగా తెలంగాణ జాగృతి

**గిగ్ వర్కర్స్ అధ్యయన కమిటీలో భానోత్ వెంకట్ నాయక్‌కు కీలక బాధ్యత**

**హైద్రాబాద్, 20 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**

తెలంగాణ రాష్ట్రంలో వేగంగా విస్తరిస్తున్న గిగ్ ఎకానమీ రంగంలో పనిచేస్తున్న లక్షలాది కార్మికుల హక్కులు, సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మరో కీలక ముందడుగు వేశారు. గిగ్ వర్కర్ల సమస్యలను లోతుగా అధ్యయనం చేసి, ప్రభుత్వ స్థాయిలో పరిష్కారాలకు దారితీయాలనే లక్ష్యంతో ప్రత్యేకంగా గిగ్ వర్కర్స్ అధ్యయన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో భానోత్ వెంకట్ నాయక్‌కు సభ్యుడిగా కీలక బాధ్యతలు అప్పగించారు. గిగ్ వర్కర్స్ కమిటీలో అవకాశం కల్పించినందుకు భానోత్ వెంకట్ నాయక్ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకి, అలాగే తెలంగాణ జాగృతి స్టీరింగ్ కమిటీ గౌరవ సభ్యులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, అప్పగించిన బాధ్యతలను పూర్తి నిబద్ధతతో, పారదర్శకంగా నిర్వహిస్తానని ఆయన స్పష్టం చేశారు. గిగ్ వర్కర్ల సమస్యలను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి, వారి గొంతుకగా నిలవడమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వెంకట్ నాయక్ మాట్లాడుతూ, స్విగ్గీ, జొమాటో వంటి ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సంస్థల్లో పనిచేస్తున్న డెలివరీ బాయ్స్, ఓలా-ఉబర్ క్యాబ్ డ్రైవర్లు, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ డెలివరీ సిబ్బంది, ఫ్రీలాన్స్ ఫోటోగ్రాఫర్లు, ఈవెంట్స్ రంగంలో పనిచేసే కార్మికులు సహా వివిధ విభాగాల్లో ఉన్న గిగ్ వర్కర్ల సమస్యలను కమిటీ ద్వారా గుర్తించి పరిష్కార దిశగా ముందుకు వెళ్తామని తెలిపారు. ముఖ్యంగా ఉద్యోగ భద్రత లేకపోవడం, స్థిరమైన ఆదాయం లేకుండా పనిచేయాల్సిన పరిస్థితులు, అధిక పని గంటలు, ప్రమాదాల సమయంలో రక్షణ లేకపోవడం వంటి అంశాలు గిగ్ వర్కర్లను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని అన్నారు. గిగ్ వర్కర్లకు న్యాయమైన పారితోషికం, పని గంటల నియంత్రణ, ప్రమాద బీమా, ఆరోగ్య బీమా, సామాజిక భద్రత, చట్టపరమైన గుర్తింపు వంటి అంశాలపై స్పష్టమైన కార్యాచరణ రూపొందించి ప్రభుత్వానికి సిఫారసులు చేయడమే ఈ కమిటీ ప్రధాన ఉద్దేశమని వెంకట్ నాయక్ వివరించారు. గిగ్ ఎకానమీ పేరుతో కార్మికులను దోపిడీ చేసే పరిస్థితులకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. గిగ్ ఎకానమీ వేగంగా విస్తరిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఈ రంగంలో పనిచేసే వర్కర్లు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కీలకంగా మారుతున్నప్పటికీ, వారికి తగిన రక్షణ, గుర్తింపు లభించడం లేదని తెలంగాణ జాగృతి భావిస్తోంది. అందులో భాగంగానే గిగ్ వర్కర్స్ కమిటీ ఏర్పాటు చేసి, వారి సమస్యలను ఒక వేదికపైకి తీసుకువచ్చి, విధాన రూపకల్పనలో భాగస్వాములుగా చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. తెలంగాణ జాగృతి తీసుకున్న ఈ నిర్ణయం రాష్ట్రవ్యాప్తంగా గిగ్ వర్కర్లలో కొత్త ఆశలు రేకెత్తిస్తోంది. భానోత్ వెంకట్ నాయక్ వంటి క్రియాశీల నాయకుల భాగస్వామ్యంతో ఈ కమిటీ మరింత ప్రభావవంతంగా పనిచేసి, గిగ్ వర్కర్ల హక్కులు, సంక్షేమానికి బలమైన వేదికగా నిలుస్తుందనే అభిప్రాయం పలువురిలో వ్యక్తమవుతోంది.



# సత్యం కుంభకోణం మరోసారి తెరపైకి..

**రామలింగరాజు సహా 213 మందికి ఈడీ కోర్టు నోటీసులు**

**జన్వాడ భూముల కేసులో రామలింగరాజు కుటుంబానికి నోటీసులు**

**రాజుతో పాటు మొత్తం 213 మందికి ఆదేశాలు జారీ చేసిన ఈడీ కోర్టు**

**కీలక వ్యక్తి పిటిషన్‌తో వెలుగులోకి రూ.5000 కోట్ల భూముల వ్యవహారం**

**ఈ నెల 27కి తదుపరి విచారణ వాయిదా**

**విజయవాడ, జై భీమ్ న్యూస్**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను, దేశ కార్పొరేట్ రంగాన్ని కుదిపేసిన సత్యం కంప్యూటర్స్ కుంభకోణం మరోసారి వార్తల్లోకి వచ్చింది. ఈ స్కామ్‌తో ముడిపడి ఉన్న జన్వాడ భూముల వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసుకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ప్రత్యేక కోర్టు.. సత్యం వ్యవస్థాపకుడు బైర్రాజు రామలింగరాజు, ఆయన కుటుంబ సభ్యులు నందిని రాజు, తేజ రాజులతో పాటు మొత్తం 213 మందికి నోటీసులు జారీ చేసింది. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని ఈడీని ఆదేశిస్తూ, తదుపరి విచారణను ఈ నెల 27వ తేదీకి వాయిదా వేసింది. ఈ కేసులో ఏ-153గా ఉన్న శతభిష కంపెనీలో డైరెక్టర్‌గా పనిచేసిన అభినవ్ అల్లాడి (ఏ-12) అనే వ్యక్తి ఇటీవల ఈడీ కోర్టులో పిటిషన్ దాఖలు చేయడంతో ఈ వ్యవహారం మళ్లీ మొదటికొచ్చింది. జన్వాడ భూముల కొనుగోళ్లలో జరిగిన మోసపూరిత లావాదేవీల గురించి తనకు పూర్తి సమాచారం తెలుసని, తన వాంగ్మూలాన్ని సాక్షిగా నమోదు చేసుకోవాలని ఆయన కోర్టును అభ్యర్థించారు. సత్యం స్కామ్ ద్వారా వచ్చిన వేల కోట్ల రూపాయలను హైదరాబాద్ శివార్లలోని విలువైన భూముల కొనుగోలుకు మళ్లించారని ఆయన తన పిటిషన్‌లో ఆరోపించారు. ప్రధానంగా, శంషాబాద్ సమీపంలోని జన్వాడ గ్రామ పరిధిలో సర్వే నంబర్లు 306 నుంచి 316 మధ్య ఉన్న సుమారు 90 ఎకరాల భూమిని శతభిష కంపెనీ, దాని డైరెక్టర్లు మోసపూరితంగా కొనుగోలు చేశారని పిటిషనర్ పేర్కొన్నారు. ఈ భూముల ప్రస్తుత మార్కెట్ విలువ రూ.5,000 కోట్లకు పైగా ఉంటుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. కొందరు ప్రభుత్వ అధికారులు, రాజకీయ నాయకులతో కుమ్మక్కై, రెవెన్యూ రికార్డులను తారుమారు చేసి బినామీ లావాదేవీలకు పాల్పడ్డారని ఆరోపించారు. మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) ప్రకారం ఈ భూములను నేరపూరిత ఆస్తులుగా గుర్తించాల్సి ఉన్నప్పటికీ, ఈడీ అధికారులు కొందరితో కుమ్మక్కై అలా చేయలేదని వాదించారు. ఈ మోసంలో తాను కూడా బాధితుడినేనని, అసలు భూ యజమానులతో ఒప్పందాలు చేసుకుని తాను కూడా నష్టపోయానని అభినవ్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆయన వాదనలు విన్న న్యాయస్థానం, ప్రతివాదులందరికీ నోటీసులు జారీ చేసింది. 2009లో వెలుగుచూసిన సత్యం కంప్యూటర్స్ కుంభకోణంలో కంపెనీ ఖాతాలను తారుమారు చేసి, షేర్ల ధరలను కృత్రిమంగా పెంచి రామలింగరాజు భారీ మోసానికి పాల్పడ్డారని ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఈ కేసులో ఆయనకు జైలు శిక్ష కూడా పడింది. ఇప్పుడు జన్వాడ భూముల రూపంలో ఈ కేసు మళ్లీ తెరపైకి రావడం సర్వత్రా ఆసక్తిని రేపుతోంది.




# 'మన శంకర వరప్రసాద్ గారు' టిక్కెట్ ధరల పెంపు

**తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు**

**టిక్కెట్ ధరల పెంపుపై హైకోర్టులో న్యాయవాది విజయ్ గోపాల్ పిటిషన్**

**టిక్కెట్ ధరల పెంపు ఉత్తర్వులను 90 రోజుల ముందే ఇవ్వాలని ఆదేశం**

**తెలంగాణ రాష్ట్ర హోంశాఖకు హైకోర్టు ఆదేశాలు**



**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తెలంగాణ రాష్ట్ర హైకోర్టు సినిమా టిక్కెట్ ధరల పెంపునకు సంబంధించి కీలక ఆదేశాలు జారీ చేసింది. ఇకపై టిక్కెట్ ధరల పెంపు ఉత్తర్వులను 90 రోజుల ముందే ఇవ్వాలని రాష్ట్ర హోంశాఖను ఆదేశించింది. చిరంజీవి నటించిన 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రం టిక్కెట్ ధరల పెంపు విషయంలో హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిపై కోర్టు ధిక్కరణ కేసు నమోదైంది. ఈ చిత్రం టిక్కెట్ ధరల పెంపు ఉత్తర్వులపై న్యాయవాది విజయ్ గోపాల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 'రాజా సాబ్' చిత్రానికి సంబంధించి టిక్కెట్ ధరలపై ఈ నెల 9న వాదనలు జరిగాయని, 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రానికి టిక్కెట్ ధరలను పెంచుతూ అంతకుముందు రోజు 8న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించిన హైకోర్టు, తదుపరి విచారణను వాయిదా వేసింది. అదే సమయంలో ఇకపై టిక్కెట్ ధరల పెంపు ఉత్తర్వులను 90 రోజుల ముందే ఇవ్వాలని ఆదేశించింది.

# ఫోన్ ట్యాపింగ్‌పై కవిత ప్రశ్నలకు బీఆర్ఎస్ నేతలు సమాధానం చెప్పలేకపోతున్నారు: అద్దంకి దయాకర్

**హరీశ్ రావుపై అద్దంకి దయాకర్, బీర్ల ఐలయ్య, బల్మూరి వెంకట్ ఆగ్రహం**

**ఇంటి అల్లుడి ఫోన్ కూడా ట్యాప్ చేయించారని కవిత ఆరోపించారన్న కాంగ్రెస్ నాయకులు**

**హరీశ్ రావు బాధితుడైతే వివరాలు చెప్పాలి, బాధ్యుడైతే సమాధానం చెప్పాలని డిమాండ్**



**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

ఇంటి అల్లుడి ఫోన్ కూడా ట్యాప్ చేయించారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారని, ఆమె వేసిన ప్రశ్నలకు బీఆర్ఎస్ నాయకులు సమాధానం చెప్పలేకపోతున్నారని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు అద్దంకి దయాకర్, బీర్ల ఐలయ్య, బల్మూరి వెంకట్ అన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీశ్ రావును సిట్ విచారిస్తోంది. విచారణకు హాజరు కావడానికి ముందు హరీశ్ రావు చేసిన విమర్శలపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో హరీశ్ రావు బాధితుడైతే వివరాలు చెప్పాలని, బాధ్యుడైతే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కేసు కొత్తదేమీ కాదని, గత రెండేళ్లుగా దీనిపై విచారణ సాగుతోందని అన్నారు. హరీశ్ రావు తనకు తాను పోరాట యోధుడిలా భావిస్తున్నారని ఎద్దేవా చేశారు. పదేళ్ల పాటు ఫోన్లు ట్యాప్ చేయించారని ఆరోపించారు. ఇంటి అల్లుడి ఫోన్ కూడా ట్యాప్ చేయించారని స్వయంగా కేసీఆర్ కూతురు కవిత చెప్పారని గుర్తు చేశారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఫోన్ ట్యాపింగ్ అంటూ కాంగ్రెస్ డ్రామాలు చేస్తోందని హరీశ్ రావు అనడం విడ్డూరంగా ఉందని అన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు రేవంత్ రెడ్డిని ఎలా వేధించారో అందరికీ తెలిసిందేనని అన్నారు. ముఖ్యమంత్రిపై ఇష్టం వచ్చినట్లు నోరు పారేసుకుంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. హరీశ్ రావుకు నిజాయతీ ఉంటే ప్రజల సొమ్మును దోచుకోలేదని ప్రమాణం చేయాలని వారు అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు తప్పు చేయకుంటే విచారణను ఎదుర్కోవడానికి భయమెందుకని ప్రశ్నించారు. తాము కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే బీఆర్ఎస్ నేతలు బయట కూడా తిరగలేరని వారు అన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో అధికారులతో తప్పుడు పనులు చేయించి వారిని అబాసుపాలు చేశారని అన్నారు. తెలంగాణ ఆర్థిక విధ్వంసానికి కేసీఆరే కారణమని ఆరోపించారు. తప్పు చేసిన వారికి ఎవరికైనా శిక్ష పడటం ఖాయమని అన్నారు.

# సిట్ విచారణకు వెళుతూ సీఎం రేవంత్ కు హరీశ్ రావు వార్నింగ్

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నోటీసులకు, కేసులకు తాను భయపడబోనని మాజీ మంత్రి, బీఆర్ఎస్ కీలక నేత హరీశ్ రావు స్పష్టం చేశారు. సిట్ నోటీసుల మేరకు విచారణకు హాజరయ్యేందుకు వెళుతూ తెలంగాణ భవన్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశిస్తూ.. తాటాకు చప్పుళ్లకు తాను భయపడనని, రేపు జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలే రేవంత్ రెడ్డికి బుద్ధి చెబుతారని హెచ్చరించారు. న్యాయ వ్యవస్థపై తమకు నమ్మకం ఉందని చెబుతూ.. కేసులపై చట్టపరంగానే పోరాడి తేల్చుకుంటామని స్పష్టం చేశారు. కాగా, ఫోన్ ట్యాపింగ్ కేసులో మరోమారు విచారణకు రావాలంటూ హరీశ్ రావుకు సోమవారం సిట్ నోటీసులు జారీ చేసింది. దీంతో మంగళవారం ఉదయం హరీశ్ రావు సిట్ విచారణకు హాజరయ్యేందుకు ఎస్పీ ఆఫీసుకు వెళ్లారు. అంతకుముందు తెలంగాణ భవన్ కు వచ్చిన హరీశ్ రావుకు మద్దతుగా కార్యకర్తలు, పార్టీ నేతలు భారీ సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. ఎస్పీ కార్యాలయానికి బయలుదేరిన హరీశ్ రావు కారు వెంబడి పార్టీ నేతలు కూడా వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో తెలంగాణ భవన్ వద్ద ఉద్రిక్తత నెలకొంది.

# మూగజీవాల పట్ల హింస తగదంటూ యాంకర్ రష్మి కీలక వ్యాఖ్యలు

**ఇవ్వాళ నోరులేని జీవాలు, రేపు అమ్మానాన్నలనూ అడ్డుతొలగించుకుంటారా? అంటూ మండిపాటు**
**వీధి కుక్కల విషయంలో అసలు సమస్యను గుర్తించాలని సూచన**
**జంతువులు కూడా పకృతిలో భాగమేనని వ్యాఖ్య**

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

"అడ్డుగా ఉన్నాయని ఇవ్వాళ మూగ జీవాలను చంపేస్తున్నాం.. రేపు ముసలి వాళ్లయ్యారు, అడ్డుగా ఉన్నారని అమ్మానాన్నలను కూడా వదిలించుకుంటామా.." అంటూ యాంకర్ రష్మి గౌతమ్ ప్రశ్నించారు. వీధి కుక్కల పట్ల జరుగుతున్న హింసను ఆమె ఖండించారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన సమావేశంలో రష్మి మాట్లాడారు. జంతువుల పట్ల మానవత్వం ప్రదర్శించాలని కోరారు. రుచి కోసం మూగజీవాలను చంపి తింటున్నామని, దూడలకు అందాల్సిన జున్ను పాలను కూడా పిండుకుని తాగేస్తున్నామని, ఇప్పుడు కుక్కలు కరుస్తున్నాయని వందలాది వీధి కుక్కలను అమానుషంగా చంపేస్తున్నామని వాపోయారు. ఇటీవల తెలంగాణలోని రెండు గ్రామాల్లో వందలాది కుక్కలను విషపు ఇంజెక్షన్లతో చంపేయడంపై రష్మి ఆవేదన వ్యక్తం చేశారు. కుక్కలు మనుషులను కరుస్తున్నాయన్న కారణాలతో వాటిని చంపాలని చూడటం సరికాదన్నారు. అసలు సమస్యను గుర్తించే ప్రయత్నం చేయాలని కోరారు. మీడియా కూడా కేవలం కుక్కల వల్ల జరిగే ప్రమాదాలనే హైలైట్ చేస్తోందని, కానీ వాటికి ఎదురవుతున్న కష్టాలను చూపడంలేదని రష్మి మండిపడ్డారు. జంతువులు కూడా ప్రకృతిలో భాగమేననే విషయాన్ని గుర్తించాలన్నారు. పూర్వం అన్నం వండాక మొదటి ముద్ద ఆవుకు, కుక్కకు పెట్టే సంప్రదాయం ఉండేదని





గుర్తుచేశారు. కానీ ఇప్పుడు కేవలం బట్టల మీద పడి కొట్టుకుంటున్నామని అంటూ, మహిళల వస్త్రధారణపై ఇటీవల జరిగిన వివాదాన్ని రష్మి పరోక్షంగా ప్రస్తావించారు. సంస్కృతి అంటే కేవలం వేసుకునే దుస్తులు మాత్రమే కాదు.. తోటి జీవుల పట్ల చూపే కరుణ కూడా అని రష్మి వ్యాఖ్యానించారు.

## దుర్గం చెరువును వారు పట్టించుకోవడం లేదు

**హైడ్రా కమిషనర్ రంగనాథ్**
**దుర్గం చెరువును పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్**
**దుర్గం చెరువులో పెరిగిన గుర్రపుడెక్క**
**బాధ్యతను హైడ్రా తీసుకుంటుందన్న రంగనాథ్**



హైదరాబాద్, జై భీమ్ న్యూస్

దుర్గం చెరువును సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని, ఇక నుంచి ఆ బాధ్యతను తాము తీసుకుంటామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. దుర్గం చెరువు, పరిసర ప్రాంతాలను ఆయన పరిశీలించారు. జీహెచ్ఎంసీ, జలమండలి, నీటిపారుదల, రహేజా అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. సమీప ప్రాంతాల నుంచి మురుగు నీరు చేరడం వల్లే దుర్గం చెరువులో గుర్రపుడెక్క భారీగా పెరిగిందని రంగనాథ్ అన్నారు. అధికారులు ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదని ఆయన పేర్కొన్నారు. దుర్గం చెరువులో గుర్రపుడెక్క పెరగడంతో పర్యాటకం దెబ్బతిన్నది. చెరువులో పర్యాటక బోట్లు కూడా తిరగడం లేదు. బోటింగ్ లేకపోవడంతో సందర్శనకు వచ్చిన పర్యాటకులు నిరాశతో వెళ్లిపోతున్నారు. ఈ నేపథ్యంలో అధికారులతో కలిసి హైడ్రా కమిషనర్ దుర్గం చెరువును సందర్శించారు.

## రూ. 1,600 కోట్ల బొగ్గు గనుల విషయంలో రేవంత్, మంత్రుల మధ్య విభేదాలు వచ్చాయి: వేముల ప్రశాంత్ రెడ్డి

**కాంట్రాక్టుల్లో అవినీతిని బయటపెట్టినందుకే హరీశ్ రావును టార్గెట్ చేశారన్న వేముల**
**సుప్రీంకోర్టు క్లీన్ చిట్ ఇచ్చినా వేధిస్తున్నారని మండిపాటు**
**దండుపాళ్యం ముఠా రాష్ట్రాన్ని నడుపుతోందని విమర్శ**



హైదరాబాద్, జై భీమ్ న్యూస్

సింగరేణి బొగ్గు గనుల కాంట్రాక్టుల్లో జరిగిన భారీ అవినీతిని బయటపెట్టినందుకే మాజీ మంత్రి హరీశ్ రావును టార్గెట్ చేసి సిట్ నోటీసులు జారీ చేశారని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, ఇది పూర్తిగా రాజకీయ కక్షసాధింపు చర్య అని మండిపడ్డారు. సుప్రీంకోర్టు క్లీన్ చిట్ ఇచ్చినప్పటికీ కావాలనే హరీశ్ రావును వేధిస్తున్నారని అన్నారు. అసెంబ్లీ వేదికగా, ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతిని ప్రశ్నిస్తుంటే కేసులు పెట్టి భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కాళేశ్వరం, ఫార్ములా ఈ-రేస్, విద్యుత్ అంశాల పేరుతో విచారణలంటూ వేధింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. ఎంతమంది నోటీసులు ఇచ్చినా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను బయటపెడుతూనే ఉంటామని స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్రాన్ని దండుపాళ్యం ముఠా నడుపుతోందని, ఆ ముఠాకు నాయకుడు సీఎం రేవంత్ రెడ్డేనని వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సివిల్ సప్లయ్, సమ్మక్క సారలమ్మ టెండర్లు, పారిశ్రామిక భూముల కేటాయింపుల్లో భారీ అవినీతి జరిగిందని ఆరోపించారు. రూ.1,600 కోట్ల బొగ్గు గనుల కాంట్రాక్ట్ విషయంలో సీఎం, మంత్రుల మధ్యే విభేదాలు వచ్చాయని తెలిపారు. రోజుకొక కుంభకోణంతో ప్రభుత్వం నడుస్తోందని విమర్శించిన ఆయన, ప్రభుత్వ అవినీతిపై కూడా సిట్ వేయాలని డిమాండ్ చేశారు. హరీశ్ రావు ప్రజల కోసం పోరాడిన నాయకుడని, ఆయన వెంట తెలంగాణ సమాజం మొత్తం ఉందని వేముల ప్రశాంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## తెలంగాణ ఇంటర్ బోర్డు కీలక నిర్ణయం.. విద్యార్థులకు ఊరట

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

తెలంగాణలో ఇంటర్ వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఇంటర్ బోర్డు ఊరట కల్పించింది. పరీక్షా కేంద్రానికి 5 నిమిషాల వరకు ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను కూడా పరీక్ష రాసేందుకు అనుమతించాలని నిర్ణయించింది. గతేడాది అమలు చేసిన ఈ నిబంధననే ఈసారి కూడా కొనసాగించనున్నట్లు స్పష్టం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు ఇంటర్ థియరీ పరీక్షలు జరగనున్నాయి. ఈ పరీక్షలకు 9 లక్షల మందికి పైగా విద్యార్థులు ఫీజులు చెల్లించారు. కాగా, రేపు, ఎల్లుండి ఇంగ్లిష్ ప్రాక్టికల్స్, 23న ఎథిక్స్ అండ్ హ్యూమన్ వ్యాల్యూస్, 24న ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్షలు నిర్వహిస్తారు. ఇక, ఫిబ్రవరి 2 నుంచి 21 వరకు ఇతర ప్రాక్టికల్ పరీక్షలు జరగనున్నాయి.

## సిట్ విచారణకు హాజరుకానున్న హరీశ్ రావు

**తెలంగాణ భవన్ లో కీలక భేటీ**
**ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో హరీశ్ కు సిట్ నోటీసులు**
**జూబ్లీహిల్స్ పీఎస్ లో విచారణకు హాజరుకావాలన్న సిట్ అధికారులు**
**కేటీఆర్, ఇతర కీలక నేతలతో హరీశ్ భేటీ**



హైదరాబాద్, జై భీమ్ న్యూస్

తెలంగాణ రాజకీయాల్లో సంచలనం రేపుతున్న ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. విచారణలో భాగంగా మాజీ మంత్రి హరీశ్ రావుకు ప్రత్యేక విచారణ బృందం (సిట్) నోటీసులు జారీ చేసింది. ఈరోజు ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొంది. ఈ విచారణ కోసం సిట్ అధికారులు ఇప్పటికే ప్రత్యేక ప్రశ్నల జాబితాను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఇవాళ ఆయన ఇచ్చే సమాధానాల ఆధారంగా కేసు ముందుకు సాగనుంది. గత ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష నాయకులు, వ్యాపారవేత్తలు, పలువురు ప్రముఖుల ఫోన్లు ట్యాపింగ్ చేశారనేది ఈ కేసులోని ప్రధాన ఆరోపణ. ఈ క్రమంలో తన నివాసం నుంచి తెలంగాణ భవన్ కు హరీశ్ రావు చేరుకున్నారు. ఈ సందర్భంగా పార్టీకి చెందిన కీలక నేతలతో హరీశ్, కేటీఆర్ భేటీ అయ్యారు. మరోవైపు, సుప్రీంకోర్టు క్లీన్ చిట్ ఇచ్చినా... రేవంత్ రెడ్డి ప్రభుత్వం హరీశ్ రావును వేధిస్తోందని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. తెలంగాణ భవన్ నుంచి సిట్ విచారణకు హరీశ్ వెళ్లనున్నారు. హరీశ్ విచారణ నేపథ్యంలో బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్కంఠ నెలకొంది. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని రేవంత్ ప్రభుత్వం చాలా సీరియస్ గా పరిగణిస్తున్న సంగతి తెలిసిందే.

## హైదరాబాద్ నిమ్స్‌లో స్టెమ్ సెల్ ల్యాబ్ ప్రారంభం

**నిమ్స్‌లో స్టెమ్ సెల్ ల్యాబ్‌ను ప్రారంభించిన మంత్రి దామోదర రాజనర్సింహ**

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

భవిష్యత్తులో పేద రోగులకు అతి తక్కువ ఖర్చుతో స్టెమ్ సెల్ థెరపీ అందించవచ్చన్న మంత్రి రాజనర్సింహ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన స్టెమ్ సెల్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ల్యాబ్‌ను మంత్రి దామోదర రాజనర్సింహ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పేద ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. విత్తనం నుంచి మహా వృక్షం ఎలా ఎదుగుతుందో, అలాగే స్టెమ్ సెల్స్ ద్వారా కొత్త కణాలు, అవయవాలను సృష్టించవచ్చని మంత్రి వివరించారు. మన శరీరంలోని ఏదైనా భాగం దెబ్బతిన్నప్పుడు లేదా తొలగించబడినప్పుడు, ఆ భాగాన్ని తిరిగి రిపేర్ చేసే అద్భుతమైన శక్తి స్టెమ్ సెల్స్‌కు ఉందని తెలిపారు. మందులతో నయం కాని మొండి వ్యాధులను కూడా నయం చేసే సామర్థ్యం వీటికి ఉందన్నారు. ముఖ్యంగా క్యాన్సర్, రక్త సంబంధిత వ్యాధులు, తలసేమియా వంటి అనేక రుగ్మతలతో బాధపడే రోగులకు ఈ చికిత్స సంజీవని లాంటిదని మంత్రి పేర్కొన్నారు. ఆయా వ్యాధుల కారణంగా దెబ్బతిన్న కణజాలాన్ని మళ్లీ కొత్తగా సృష్టించేందుకు స్టెమ్ సెల్ థెరపీ ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. ప్రస్తుతం స్టెమ్ సెల్ చికిత్స కొన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో మాత్రమే అందుబాటులో ఉందని, అది కూడా లక్షల రూపాయల ఖర్చుతో కూడుకున్నదని మంత్రి తెలిపారు. సామాన్య ప్రజలకు కూడా తక్కువ ఖర్చుతో అత్యాధునిక వైద్య సేవలు అందించాలన్న ఉద్దేశంతోనే నిమ్స్‌లో ఈ స్టెమ్ సెల్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఈ ల్యాబ్‌లో స్టెమ్ సెల్స్‌పై లోతైన పరిశోధనలు జరుగుతున్నాయని, తులసి థెరప్యూటిక్స్‌తో పాటు నిమ్స్ వైద్యులు ఈ పరిశోధనలను నిర్వహిస్తారని మంత్రి వివరించారు. ఈ పరిశోధనల ఫలితంగా భవిష్యత్తులో నిమ్స్‌లోనే పేద రోగులకు అతి తక్కువ ఖర్చుతో స్టెమ్ సెల్ థెరపీ అందించగలమని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తరఫున అవసరమైన అన్ని విధాలా సహకారం అందిస్తామని, త్వరలోనే ఈ ల్యాబ్ పరిశోధనల ఫలితాలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయని మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు.

## పన్ను ఎగవేతకు చెక్.. గూడ్స్ వాహనాలపై తెలంగాణ సర్కార్ కొత్త రూల్

**గూడ్స్ వాహనాలకు జీవితకాల పన్ను విధానంపై తెలంగాణ ప్రభుత్వం కసరత్తు**
**త్రైమాసిక పన్ను చెల్లింపు విధానానికి స్వస్తి పలకాలని నిర్ణయం**
**పన్ను ఎగవేతను అరికట్టేందుకే ఈ కొత్త విధానమంటున్న ప్రభుత్వం**
**కొత్తగా కొనుగోలు చేసే వాహనాలకు మాత్రమే ఈ నిబంధన వర్తింపు**



హైదరాబాద్, జై భీమ్ న్యూస్

సరకు రవాణా వాహనాల పన్నుల విధానంలో కీలక మార్పులు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఏళ్లుగా అమల్లో ఉన్న త్రైమాసిక (ప్రతి మూడు నెలలకోసారి) పన్ను చెల్లింపు విధానానికి స్వస్తి పలికి, దాని స్థానంలో జీవితకాల పన్ను (లైఫ్‌టైమ్ ట్యాక్స్) విధానాన్ని తీసుకురావాలని యోచిస్తోంది. ఈ మార్పు ద్వారా వాహనాల యజమానులకు ఊరట కల్పించడంతో పాటు పన్ను ఎగవేతకు శాశ్వతంగా అడ్డుకట్ట వేయవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం ఉన్న విధానం ప్రకారం రాష్ట్రంలోని సుమారు 25 శాతం గూడ్స్ వాహనాలు సరిగా పన్ను చెల్లించడం లేదని ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లడమే కాకుండా, పన్నుల వసూలు కోసం అధికారులు తరచూ వాహనాలను ఆపి తనిఖీ చేయాల్సి వస్తోంది. ఈ సమస్యను అధిగమించేందుకు, కొత్తగా కొనుగోలు చేసే సరకు రవాణా వాహనాలకు రిజిస్ట్రేషన్ సమయంలోనే జీవితకాల పన్ను వసూలు చేయాలని రవాణా శాఖ ప్రతిపాదిస్తోంది. వాహనం ధరలో 7.5 శాతాన్ని లైఫ్‌టైమ్ ట్యాక్స్‌గా నిర్ణయించే అవకాశం ఉంది. ఈ అంశంపై రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఇప్పటికే అసెంబ్లీలో సూచనప్రాయంగా వెల్లడించారు. ఈ కొత్త విధానం అమల్లోకి వస్తే వాహన యజమానులకు ఎంతో మేలు జరుగుతుంది. ప్రతి మూడు నెలలకు ఒకసారి పన్ను చెల్లించే భారం, గడువు మరచిపోతే విధించే జరిమానాల బెడద తప్పుతుంది. అధికారుల తనిఖీల నుంచి కూడా ఉపశమనం లభిస్తుంది. అయితే, ఈ కొత్త నిబంధన కేవలం కొత్తగా కొనుగోలు చేసే వాహనాలకు మాత్రమే వర్తిస్తుందని, పాత వాహనాలకు యథావిధిగా త్రైమాసిక పన్ను విధానమే కొనసాగుతుందని స్పష్టమవుతోంది. ప్రభుత్వానికి ఈ విధానం వల్ల ప్రారంభంలో ఒకేసారి పెద్ద మొత్తంలో ఆదాయం సమకూరినా, భవిష్యత్తులో ఆ వాహనాల నుంచి త్రైమాసిక ఆదాయం ఆగిపోతుంది. అయినప్పటికీ, పన్ను ఎగవేతను పూర్తిగా నివారించడం ద్వారా దీర్ఘకాలంలో ప్రభుత్వానికి ఆర్థికంగా ప్రయోజనం చేకూరుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. త్వరలోనే దీనిపై అధికారిక ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది.

## నిర్మల్‌లో ఘోర రోడ్డు ప్రమాదం.. నలుగురు మృతి

నిర్మల్, జై భీమ్ న్యూస్

నిర్మల్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. బైంసా పట్టణంలోని సత్‌పూల్ బ్రిడ్జి వద్ద ఎదురెదురుగా వస్తున్న కంటైనర్, కారు ఢీకొన్న ఘటనలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తమ బంధువులను పరామర్శించేందుకు కారులో హైదరాబాద్ వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ప్రమాదంలో కబీరు మండలం కుప్టి గ్రామానికి చెందిన బోజరాం పటేల్ (42), రాజన్న (60), బాబన్న (70), కారు డ్రైవర్ వికాస్ (35) మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారిలో ఇటీవలే సర్పంచ్‌గా ఎన్నికైన గంగాధర్ కూడా ఉన్నారు. ఆయనకు తలకు తీవ్ర గాయాలు కావడంతో నిజామాబాద్‌లోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బైంసా ప్రాంతీయ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# నమ్మకం లేకపోతే ఏ బంధం నిలవదు..!

వివాహ జీవితం సుఖంగా సాగాలంటే ప్రేమ, గౌరవం, నమ్మకం, క్షమ, సానుభూతి వంటి విలువలతో నిండిన అనుబంధం కావాలి. ఇందుకు సద్గురు ఇచ్చిన మార్గదర్శకాలు ఎంతో ఉపయోగపడతాయి. ఈ విలువలు జీవిత భాగస్వాముల మధ్య బంధాన్ని బలపరచడమే కాకుండా.. జీవితాన్ని సంతోషంగా జీవించడానికి ఉపయోగపడతాయి. వివాహం అనేది కేవలం ఒక సంప్రదాయ సంబంధం కాదు. సద్గురు ఏం చెబుతున్నారో తెలుసా..? వివాహం అనేది మన జీవితంలో మనకు తోడుగా ఉండే వ్యక్తిని ఎంచుకోవడమే. శారీరక, భావోద్వేగ, మానసిక, ఆర్థిక, సామాజిక అవసరాలను పూరించగల వ్యక్తి జీవిత భాగస్వామిగా ఉండాలి. ఈ బంధం నిశ్చలంగా నిలవాలంటే దానికి శ్రద్ధ అవసరం. ఏ బంధమైనా రోజురోజుకూ మారుతూ ఉంటుంది. మనం నిర్లక్ష్యం చేస్తే దూరమవుతుంది. కాబట్టి మన జీవిత భాగస్వామితో అనుబంధాన్ని ప్రేమగా, శ్రద్ధగా చూసుకోవాలి. ఒక మంచి వివాహ బంధానికి ముఖ్యమైన అంశం సంభాషణ. మనసులో ఉన్న విషయాలను బహిరంగంగా చెప్పుకోవడం ద్వారా భావోద్వేగాలు సమతుల్యతలో ఉంటాయి. ఇది ఇద్దరినీ దగ్గర చేస్తుంది. అలాగే ఒకరినొకరు గౌరవించడం కూడా ఎంతో అవసరం. వివాహం వల్ల మన వ్యక్తిత్వాన్ని కోల్పోవాల్సిన పని లేదు. ప్రతి వ్యక్తికీ తన సొంత అభిప్రాయాలు ఉంటాయి. అవి భిన్నంగా ఉన్నా.. గౌరవించాలి. ఆ గౌరవం బంధాన్ని నిలబెట్టే శక్తిగా ఉంటుంది. ఇక నమ్మకం గురించి చెప్పాలంటే.. అది లేకుండా ఎలాంటి సంబంధం నిలవదు. భర్తా భార్యల మధ్య పరస్పర నమ్మకం పెరిగేలా మాట్లాడుకోవాలి. ఒకరి నమ్మకాన్ని మరొకరు దెబ్బతీయకుండా జాగ్రత్త పడాలి. నమ్మకమే బంధాన్ని బలంగా ఉంచుతుంది. వివాహం అనగా ఒకరి ప్రపంచంలో మరొకరిని కలిపేసుకోవడం కాదు. ప్రతి ఒక్కరికీ వ్యక్తిగతంగా ఎదిగే అవకాశం ఉండాలి. కొన్ని విషయాల్లో స్వేచ్ఛ ఇవ్వడం ద్వారా బంధం మరింత ఆరోగ్యంగా మారుతుంది. మానవ సంబంధాల్లో మనుషుల మధ్య అంచనాలు, అబద్ధాలు, అపార్థాలు సాధారణం. అప్పుడు క్షమించగలగడం ఎంతో అవసరం. చిన్నచిన్న సమస్యల్ని పట్టుకొని బంధాన్ని బలహీనంగా మార్చుకోవద్దు. వ్యక్తిగత లక్షణాలను అంగీకరించగలగడం ద్వారా మన



హృదయంలో దయ, ప్రేమ పెరుగుతుంది. మన భాగస్వామిలో ఉన్న అసంపూర్ణతలను అంగీకరించగలగడం ద్వారా జీవితం మరింత సులభంగా సాగుతుంది. జీవిత భాగస్వామి చేసిన పనుల్ని బాధ్యతగా కాకుండా ప్రేమతో చూసుకోవాలి. మనకు చేయబడ్డ సహాయానికి కృతజ్ఞత చూపడం ద్వారా బంధం బలపడుతుంది. భార్యా భర్తలు ఒకే ఇంట్లో ఉన్నా.. కొన్ని ప్రత్యేకమైన సందర్భాలు కలిసి గడపడం అవసరం. కలిసి విహారయాత్రలు, భోజనాలు, లేదా మంచి సమయాన్ని గడపడం ద్వారా ప్రేమ మరింత పెరుగుతుంది. ఈ ప్రయాణంలో నవ్వు ఎంతో కీలకమైనది. ఒకరితో ఒకరు నవ్వుతూ మాట్లాడుకోవడం వల్ల మధ్యలో ఉండే ఒత్తిడులు పోతాయి. ఈ విధంగా సాన్నిహిత్యం పెరుగుతుంది. సద్గురు చెప్పిన ఈ సూచనలు వివాహ బంధాన్ని ప్రేమతో, శాంతితో నింపడానికి చాలా ఉపయోగపడతాయి. ఈ బంధం సాధారణంగా ఉండకూడదంటే, ఇద్దరూ ఒకరినొకరు అర్థం చేసుకునే మనసుతో, పరస్పర గౌరవంతో, క్షమించగల స్వభావంతో జీవించాలి. ఇలాంటి విలువలు ఉన్నప్పుడు మాత్రమే ఈ అనుబంధం బలంగా మారుతుంది.


# అరటి ఆకులో భోజనం దీని వెనుక అసలు కారణం ఇదే

మన సంస్కృతి ఆరోగ్యకరమైన జీవనశైలికి చిహ్నం. అరటి ఆకులో భోజనం తినడం అమృతంతో సమానమని నమ్ముతారు. ఇందులో ఉండే అనేక పోషకాలు ఆహార రుచిని పెంచుతాయట. దీని ప్రకారం, అరటి ఆకులపై భోజనం చేసేటప్పుడు కొన్ని ఆచారాలు పాటిస్తారు. దక్షిణాది రాష్ట్రాల్లో దాదాపు ప్రతి పండగ, వేడుకలో అరటి ఆకుల్లో భోజనం చేయడం కనిపిస్తుంది. పురాతన కాలం నుంచి అరటి ఆకులను వివిధ ఆచారాలు, వేడుకలు, రోజువారీ ఆహారంలో మనోళ్లు ఉపయోగిస్తున్నారు. మన సంస్కృతి ఆరోగ్యకరమైన జీవనశైలికి చిహ్నం. అరటి ఆకులో భోజనం తినడం అమృతంతో సమానమని నమ్ముతారు. ఇందులో ఉండే అనేక పోషకాలు ఆహార రుచిని పెంచుతాయట. దీని ప్రకారం, అరటి ఆకులపై భోజనం చేసేటప్పుడు కొన్ని ఆచారాలు పాటిస్తారు. ఆకులు కడగడం నుంచి చివరికి తినడం, ఆకులు మడతపెట్టడం వరకు కొన్ని ఆచారాలు ఉన్నాయి. తినడానికి ముందు అరటి ఆకుపై నీళ్లు చల్లడం శతాబ్దాల నాటి ఆచారం. దీనికి వివిధ కారణాలు ఉన్నాయి. అరటి ఆకులు సహజంగా కీటకాలు, సూక్ష్మజీవులను కలిగి ఉంటాయి. నీటితో చల్లడం, శుభ్రపరచడం వల్ల ఆకులపై ఉన్న కీటకాలు, సూక్ష్మజీవులు చనిపోతాయి. ఆకులపై దుమ్ము, ధూళిని తొలగించి శుభ్రంగా ఉంచడానికి కూడా ఇలా చేస్తారు. అంతేకాకుండా నీటిని చల్లడం వల్ల ఆకులు గట్టిపడతాయి. ఇలా చేయడం వల్ల తినేటప్పుడు ఆకులు చిరిగిపోవడం వంటి సమస్యలు ఉండవు. అంతేకాకుండా అరటి ఆకుపై నీరు చల్లడం చాలా పవిత్రమైన కార్యమని కూడా నమ్ముతారు. అరటి ఆకులో తిన్న తర్వాత దానిని లోపలికి మడతపెడతారు. అలా చేయడం ఆహారాన్ని తయారు చేసి వడ్డించిన వారికి గౌరవం చూపించే మార్గంగా పరిగణిస్తారు. కొన్నిసార్లు ఆహార అవశేషాలు ఆకు లోపలి భాగంలో ఉంటాయి. అందువల్ల ఆకును బయటి నుండి లోపలికి మడవటం వల్ల అవి జారి పోకుండా ఉంటాయి. అలాగే ఆకును లోపలికి మడతపెట్టడం వల్ల సూర్యరశ్మి దానిలోకి ప్రవేశించకుండా నిరోధిస్తుంది. దీనివల్ల అందులోని ఆహారం చెడిపోకుండా ఉంటుంది.



# మీ ఆరోగ్యం మీ చేతుల్లోనే

శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయి పెరిగినప్పుడు అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుంది. ఈ సమస్యలు ముఖ్యంగా ఆర్థరైటిస్, కిడ్నీ సంబంధిత వ్యాధుల రూపంలో కనిపిస్తాయి. అధిక యూరిక్ యాసిడ్ కారణంగా జాయింట్లలో నొప్పులు, వాపులు మొదలవుతాయి. గ్రీన్ కలర్ ఫుడ్స్ దినచర్యలో భాగం చేస్తే ఈ సమస్యను సహజంగా నివారించవచ్చు. పాలకూరలో శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇందులో ఉన్న మెగ్నీషియం శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయిని సమతుల్యంగా ఉంచడంలో ముఖ్యపాత్ర పోషిస్తుంది. పాలకూరను రోజూ తీసుకోవడం వల్ల శరీరానికి పుష్కలమైన పోషకాలు అందించడమే కాక.. ఆరోగ్యాన్ని కాపాడేందుకు సహాయపడుతుంది. పచ్చి బఠానీలలో ఫైబర్ అధికంగా ఉంటుంది.. ఇది శరీరానికి కావలసిన శక్తిని అందిస్తుంది. వీటిలో ఉన్న యాంటీఆక్సిడెంట్లు శరీరాన్ని డిటాక్స్ చేయడంలో తోడ్పడతాయి. గౌట్ వంటి సమస్యలను తగ్గించడానికి ఈ బీన్స్ చాలా ఉపయోగపడతాయి. గ్రీన్ టీ శరీరంలోని హానికరమైన వ్యర్థాలను బయటకు పంపడంలో సహాయపడుతుంది. ఈ టీలో ఉండే యాంటీఆక్సిడెంట్లు, ఆహ్లాదకరమైన రుచి యూరిక్ యాసిడ్ స్థాయిలను తగ్గించడంలో తోడ్పడతాయి. ప్రతిరోజూ ఒక కప్పు గ్రీన్ టీ తాగడం వల్ల మంచి ఫలితాలు పొందవచ్చు. సెలరీలో ఉన్న పోషకాలు మూత్రపిండాల పనితీరును మెరుగుపరుస్తాయి. ఇది శరీరంలోని వాపును తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. యూరిక్ యాసిడ్ స్థాయిని సమతుల్యంగా ఉంచడంలో ఈ ఆకుకూర సహాయపడుతుంది. అవకాడోలో ఆరోగ్యకరమైన కొవ్వులు అధికంగా ఉంటాయి. ఈ పండు శరీరానికి అవసరమైన ఎనర్జీ




అందించే ప్రక్రియను మెరుగుపరుస్తుంది. ఇది శరీరంలోని వ్యర్థ పదార్థాలను వెలుపలికి పంపడంలో సహాయపడుతుంది. యూరిక్ యాసిడ్ స్థాయిని తగ్గించడానికి అవకాడో ఉపయోగపడుతుంది. ఆస్పరాగస్‌లో ఫైబర్, ప్యూరిన్లు సమతుల్యంగా ఉంటాయి. ఇది శరీరంలోని హానికరమైన పదార్థాలను తగ్గించడంలో సహాయపడుతుంది. కాబట్టి ఆస్పరాగస్ ను తగిన మోతాదులో తీసుకోవడం మంచిది. గ్రీన్ బీన్స్ లో ప్యూరిన్లు తక్కువగా ఉంటాయి.. అందుకే ఇవి యూరిక్ యాసిడ్ స్థాయిని నియంత్రించడంలో సహాయపడతాయి.

## చీజ్ ఆరోగ్యానికి ఎంత మంచిదంటే..?



చీజ్ తో తయారు చేసే ఆహార పదార్థాలు ఎంతో రుచిగా ఉంటాయి. ఇంకా అలాగే చీజ్ కూడా మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. చీజ్ ను తగిన మోతాదులో తీసుకోవడం వల్ల మనం చాలా ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. ఈ చీజ్ ను మితంగా తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. చీజ్ లో క్యాల్షియం చాలా ఎక్కువగా ఉంటుంది. ఇది ఎముకలను ధృడంగా ఇంకా ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. చీజ్ ను తీసుకోవడం వల్ల ఎముకలు గుల్లబారడం ఇంకా ఎముకల పగుళ్లు వంటి సమస్యలు రాకుండా ఉంటాయి. చీజ్ లో ప్రోటీన్ అనేది ఎక్కువగా ఉంటుంది. కండరాలను ఆరోగ్యంగా ఉంచడంలో, దేహ పుష్టికి ప్రోటీన్ అనేది ఎంతో సహాయపడుతుంది. అంతేకాకుండా చీజ్ లో విటమిన్ బి12, విటమిన్ ఎ, ఫాస్ఫరస్ ఇంకా జింక్ వంటి ఎన్నో పోషకాలు ఉన్నాయి. ఇవి సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించడంలో, శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచడంలో, చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో ఇలా చాలా రకాలుగా సహాయపడతాయి. అలాగే బరువు తగ్గడంలో కూడా చీజ్ మనకు సహాయపడుతుంది. ఈ చీజ్ లో క్యాలరీలు, ప్రోటీన్, కొవ్వు పదార్థాలు ఎక్కువగా ఉన్నప్పటికి దీనిని కొద్ది మోతాదులో తీసుకోగానే కడుపు నిండిన భావన కలుగుతుంది. ఇంకా చీజ్ ను తీసుకోవడం వల్ల త్వరగా ఆకలి వేయకుండా ఉంటుంది. అందువల్ల మనం ఇతర ఆహారాలను తక్కువగా తీసుకుంటాము. ఇంకా అలాగే కొన్ని రకాల చీజ్ లు ప్రోబయాటిక్స్ ను ఎక్కువగా కలిగి ఉంటాయి. ఇవి పొట్ట ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఇంకా జీర్ణక్రియ సాఫీగా సాగేలా చేయడంలో దోహదపడతాయి. ఈ విధంగా చీజ్ మన ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుందని దీనిని తగిన మోతాదులో తీసుకోవడం వల్ల మనం సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. కాబట్టి ఖచ్చితంగా చీజ్ ని తినండి. అనేక ఆరోగ్య ప్రయోజనాలని పొందండి.

## బీర్ తాగడం వల్ల కిడ్నీలో రాళ్లు తొలగిపోతాయా?




కిడ్నీలో రాళ్లుంటే బీరు తాగితే కరిగిపోతాయని కొన్ని సార్లు వింటుంటాం. ఇది ఎంత వరకు నిజం. బీర్ రాళ్లను కరిగిస్తుందా, రాళ్ళను పగొలగొట్టి వాటిని బయటకు పంపుతుందా? కానీ ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఇది అతిపెద్ద అపోహ. కిడ్నీ మన శరీరంలో చాలా ముఖ్యమైన భాగం. ఇది మన శరీరంలోని టాక్సిన్స్‌ని తొలగించడానికి పని చేస్తుంది. కిడ్నీలో రాళ్ల వల్ల నొప్పి వస్తోందని, చాలా మంది ఆ రాళ్లను తొలగించుకోవడానికి బీరు తాగడం ప్రారంభిస్తారు. ఇప్పుడు బీర్ తాగడం వల్ల కిడ్నీలో రాళ్ల సమస్య తీరుతుందా అనే ప్రశ్న తలెత్తుతోంది. మరి ఈ విషయంలో అసలు నిజం ఏంటో ఇక్కడ తెలుసుకుందాం. ఇది కేవలం అపోహ మాత్రమేనని నిపుణులు చెబుతున్నారు. దీనికి సంబంధించి శాస్త్రీయ ఆధారం లేదు. అధ్యయనం ప్రకారం, బీర్ ఒక ఆల్కహాలిక్ డ్రింక్. ఇది ఒక మూత్రవిసర్జన, దీనిని తాగినప్పుడు సాధారణం కంటే ఎక్కువ మూత్రం ఉత్పత్తి అవుతుంది, ఇది చిన్న రాళ్లను బయటకు తీయడంలో సహాయపడుతుంది, అయితే ఇది ఇప్పటివరకు ఏ అధ్యయనంలో నిరూపించబడలేదు, అందుకే డాక్టర్ రోగికి బీర్ తాగమని సలహా ఇవ్వడు. సిఫార్సు చేయబడదు. రోగి కిడ్నీలో రాళ్ళను తొలగించడానికి ప్రయత్నిస్తున్నప్పుడు బీర్ తాగడం ప్రారంభిస్తే, దాని పర్యవసానాలు తీవ్రంగా ఉండవచ్చు, అది వ్యసనానికి గురయ్యే ప్రమాదాన్ని పెంచుతుంది, అయితే ఎక్కువ బీర్ తాగడం వల్ల మీ శరీరంపై ప్రతికూల ప్రభావం చూపే డీహైడ్రేషన్ కూడా వస్తుంది, మీ మూత్రపిండాలు దెబ్బతింటాయి. అయితే, మద్యం ఏ సందర్భంలోనైనా హానికరం. రెగ్యులర్ బీర్ తాగేవారిలో ఆక్సలేట్ కిడ్నీలో రాళ్లు ఏర్పడే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. రక్తాన్ని శుద్ధి చేయడం, మూత్రాన్ని వడపోత చేయడం, తద్వారా వ్యర్థాలను బయటకు నెట్టివేయడం కిడ్నీల పని, అయితే ఆహారంలో క్యాల్షియం, పొటాషియం, మినరల్స్ అధికంగా ఉండటం వల్ల కిడ్నీల నుంచి వ్యర్థ పదార్థాలు పూర్తిగా తొలగిపోవు. తరువాత, ఈ వ్యర్థ పదార్థాలు క్రమంగా పేరుకుపోతాయి మరియు రాళ్ల రూపాన్ని తీసుకుంటాయి, దీనిని వైద్య భాషలో కిడ్నీ స్టోన్ అంటారు.

## వెల్లుల్లి పరిమితి దాటి తింటే అనారోగ్య సమస్యలు తప్పవు

వెల్లుల్లిని ఆయుర్వేదం ప్రకారం సర్వ రోగ నివారిణిగా పిలుస్తారు. ముఖ్యంగా వెల్లుల్లి లేకుండా ఏ భారతీయ వంటకం ఉండదంటే అతిశయోక్తి కానేకాదు. వెల్లుల్లి కేవలం రుచి కోసమే కాకుండా..ఆరోగ్యపరంగా కూడా చాలా లాభదాయకం. ప్రతి భారతీయుని కిచెన్‌లో తప్పకుండా లభించే పదార్థం వెల్లుల్లి, సాధారణంగా వెల్లుల్లిని తాలింపు కోసం లేదా వంటల రుచి కోసం ఉపయోగిస్తుంటారు. అయితే అంతకుమించిన ఆరోగ్య ప్రయోజనాలు వెల్లుల్లిలో దాగున్నాయి. అందుకే తల్లి చేసే మేలు వెల్లుల్లి కూడా చేయదంటారు. కానీ వెల్లుల్లిని మోతాదుకు మించి తినకూడదంటారు. పరిమితి దాటితే వెల్లుల్లితో అనర్థాలే ఎక్కువ. ఆ వివరాలు మీ కోసం..వెల్లుల్లిని ఆయుర్వేద శాస్త్రంలో ఆరోగ్య ఖజానాగా పిలుస్తారు. ఎందుకంటే వెల్లుల్లిలోని పోషక పదార్థాలు చాలా ఎక్కువ. ఇందులో విటమిన్ బి1, కాల్షియం, కాపర్, పొటాషియం, ఫాస్ఫరస్, ఐరన్ వంటి న్యూట్రియంట్లు ఉన్నాయి. అయితే మోతాదు దాటకూడదు. వెల్లుల్లి మోతాదు దాటి తినడం వల్ల ఛాతీలో మంట సమస్య ఏర్పడుతుంది. దీనికి కారణం వెల్లుల్లిలో ఎసిడిక్ కాంపౌండ్ ఎక్కువగా ఉండటం. ఈ మంట చాలా సందర్భాల్లో భరించలేకుండా ఉంటుంది.వెల్లుల్లితో రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. అందుకే లో బీపీ రోగులు వెల్లుల్లి తీసుకోకూడదు. వెల్లుల్లి అతిగా తీసుకుంటే హైపర్ టెన్షన్ సమస్య ఏర్పడవచ్చు. శరీరంలో విపరీతమైన అలసట ఉంటుంది. వెల్లుల్లి స్వభావం వేడి చేసేది కావడంతో వేసవిలో వెల్లుల్లికి దూరంగా ఉండాలి. చలి సంబంధిత సమస్యలున్నప్పుడు వెల్లుల్లి తినడం చాలామందికి అలవాటు. ఆరోగ్యానికి ఎంతమంచిదైనా సరే రోజుకు 1-2 రెమ్మలకు మించి తినకూడదు. అదే పనిగా వెల్లుల్లి తింటే నోటి దుర్వాసన కూడా వస్తుంది.

జై భీమ్ POWER OF PEOPLE Jai Bheem



## రహస్య వివాహం వార్తలపై హీరోయిన్ డింపుల్ హయతి స్పందన

మాస్ మహారాజా రవితేజ నటించిన తాజా చిత్రం 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' థియేటర్లలో విడుదలై మంచి స్పందనను అందుకుంటోంది. వినోదంతో పాటు కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే కథనంతో తెరకెక్కిన ఈ సినిమాకు కిషోర్ తిరుమల దర్శకత్వం వహించారు. ఆషిక రంగనాథ్, డింపుల్ హయతి కథానాయికలుగా నటించి తమ పాత్రలకు న్యాయం చేశారు. ముఖ్యంగా డింపుల్ హయతి గ్లామర్‌తో పాటు నటన పరంగా కూడా ప్రేక్షకులను అలరిస్తోంది. మరోవైపు, సినిమా సక్సెస్ ను ఎంజాయ్ చేస్తున్న డింపుల్ హయతి వ్యక్తిగత జీవితానికి సంబంధించిన పుకార్లు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. ఆమెకు డేవిడ్ అనే వ్యక్తితో ఇప్పటికే రహస్యంగా పెళ్లి జరిగిందని, ఇద్దరూ కలిసే ఉంటున్నారని నెట్టింట వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఈ ప్రచారంపై తాజాగా డింపుల్ స్వయంగా స్పందిస్తూ క్లారిటీ ఇచ్చింది. సోషల్ మీడియాలో ఓ అభిమాని అడిగిన ప్రశ్నకు ఆమె సమాధానమిస్తూ, తనకు ఇప్పటివరకు పెళ్లే కాలేదని స్పష్టం చేసింది. తన పెళ్లి గురించి వస్తున్న వార్తలన్నీ పూర్తిగా అవాస్తవమని, వాటిలో ఎలాంటి నిజం లేదని చెప్పింది. ఇలాంటి రూమర్స్ సృష్టించవద్దని కోరింది.

## అల్లరి నరేశ్ కుటుంబంలో విషాదం.. హీరో తాత కన్నుమూత



సినీ హీరో అల్లరి నరేశ్ ఇంట్లో విషాదం చోటుచేసుకుంది. నరేశ్ తాత, ఈవీవీ సత్యనారాయణ తండ్రి ఈదర వెంకట్రావు ఈరోజు తెల్లవారుజామున కన్నుమూశారు. ఆయన వయస్సు ప్రస్తుతం 90 సంవత్సరాలు. వృద్ధాప్యం కారణంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని అల్లరి నరేశ్ కుటుంబం తెలిపింది. ఈ క్రమంలోనే మంగళవారం స్వగృహంలో ఆయన తుదిశ్వాస వదిలారని పేర్కొంది. పశ్చిమ గోదావరి జిల్లా కోరుమామిడిలో ఈ రోజు సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు తెలిపింది. తమ తాతగారితో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ అల్లరి నరేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగు సినీ పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు వెంకట్రావు మృతికి సంతాపం తెలియజేస్తూ నివాళులు అర్పించారు. కాగా, ఈదర వెంకట్రావు, వెంకటరత్నం దంపతులకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె.. పెద్ద కుమారుడు ప్రముఖ దర్శకుడు ఈవీవీ సత్యనారాయణ 2011 లోనే కన్నుమూశారు. ఈవీవీ సత్యనారాయణ తల్లి వెంకటరత్నం 2019 లో చనిపోయారు.



## తల్లిదండ్రులు లేని ఆడపిల్లను ఇండస్ట్రీలో అందరూ టార్గెట్ చేస్తారు: ఈషా రెబ్బా

అచ్చ తెలుగు హీరోయిన్ ఈషా రెబ్బా తన కెరీర్‌లో ఎదుర్కొన్న కష్టాలను అందరితో పంచుకుంది. తెలుగు సినిమా ఇండస్ట్రీలో అడుగుపెట్టి 12 ఏళ్లు అవుతున్నా, ఇప్పటికీ ఆమె సరైన బ్రేక్ కోసం ఎదురుచూస్తోంది. తన స్కిన్ కలర్ వల్ల ఎదురైన అవమానాల గురించి ఇటీవల ఆమె మాట్లాడింది. 'ఓం శాంతి శాంతి' సినిమా ప్రమోషన్స్ సందర్భంగా ఈషా వెల్లడించిన విషయాలు చర్చనీయాంశంగా మారాయి.తన కెరీర్ ప్రారంభంలో ఒక ఫొటో షూట్ సమయంలో, ఒక స్టార్ డైరెక్టర్ తన శరీరాన్ని అంగుళం అంగుళం జూమ్ చేసి చూస్తూ... నీ మోచేతులు నల్లగా ఉన్నాయని, నీవు ఇంకా తెల్లగా ఉండాలని అన్నాడని... ఆ వ్యాఖ్యలు ఎంతో బాధించాయని చెప్పింది. ఆ మాటలు విన్న తర్వాత చాలా ఏడ్చానని, కొంచెం తెల్లగా పుట్టి ఉంటే బాగుండేది అనిపించిందని తెలిపింది. తన తల్లి మరణించిన 12వ రోజునే షూటింగ్ కు వెళ్లాల్సి వచ్చిందని... తల్లిదండ్రులు లేని ఆడపిల్లను ఇండస్ట్రీలో అందరూ టార్గెట్ చేస్తారని తెలిపింది. అంతేకాకుండా, సినిమాలలో అవకాశాలు రావాలంటే పార్టీలకు వెళ్లాలని, తెలుగు అమ్మాయి మాదిరి రిజర్వ్ గా ఉండకూడదని కొందరు సలహాలు ఇచ్చేవారని గుర్తు చేసుకుంది.